ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

3

కర్ణాటక వార్తలు

బుధవారం 29 జనవరి 2025



సీ ప్లేన్ ప్లీజ్..!



- కేఆర్‌ఎస్‌లో ఏర్పాటు చేయండి..
- కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుతో కుమార స్వామి చర్చలు

5





బెళగావి టోల్‌ప్లాజా

- ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న టోల్ ఏజెన్సీలు
- వాహనదారుల నుంచి ముక్కుపిండి వసూళ్లు
- స్టాంప్ డ్యూటీ చెల్లించడంలో నిర్లక్ష్యం
- రూ.500 కోట్లకుపైగా బకాయిలు
- నోటీసులిచ్చినా పట్టించుకోరు..

వసూల్ రాజాలు..!

బెంగళూరు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): వాహనదారుల నుంచి ముక్కు పిండి టోల్ చార్జీలు వసూలు చేసే ఏజెన్సీలు ప్రభుత్వానికి చెల్లించాల్సిన స్టాంప్ డ్యూటీ మాత్రం ఎగ్గొడుతున్నాయి. కోట్లకు కోట్లు బకాయిలున్నా పట్టించుకోకుండా నిర్లక్ష్యం వహిస్తున్నాయి. జాతీయరహదారులపై నిరంతరంగా జరుగుతున్న ప్రమాదాలను అరికట్టేందుకు రెండున్నర దశాబ్దాలక్రిందట విస్తరణకు శ్రీకారం చుట్టారు. వేలకోట్ల రూపాయలు ఖర్చు చేసి రోడ్డుకు అనుబంధంగా ఉండే భూముల కొనుగోళ్లు, రోడ్ల నిర్మాణ పనులు, ప్రభుత్వం చేపట్టడం సాధ్యం కాదని పీపీపీ పద్ధతిన కేటాయించారు. ఇలా రాష్ట్రంలోనే కాకుండా దేశంలోనే వందలాది జాతీయ రహదారుల విస్తరణ చేపట్టారు. దీంతో ప్రయాణం సులభమయ్యింది. వాహనదారులకు ప్రయాణ గంటలు గణనీయంగా తగ్గడంతో సమయం ఎంతో ఆదా అయ్యింది. బెంగళూరు నుంచి హైదరాబాద్, ముంబై, చెన్నై, మంగళూరు వంటి నగరాలకు గతంలో 10-16 గంటల సమయం పట్టేది. కానీ రహదారుల విస్తరణతో పదిగంటలలోపే గమ్యం చేరేందుకు సాధ్యమవుతోంది. ఇలా జాతీయ రహదారుల విస్తరణ, పర్యవేక్షణ బాధ్యతలను పలు ఏజెన్సీలకు కేటాయించారు. కొన్ని నిర్మాణ సంస్థలు నేరుగా టోల్‌లు ఏర్పాటు చేసుకోగా మరికొన్ని సంస్థలు ఏజెన్సీలకు కేటాయించారు. వారికి టోల్‌గేట్లు ఏర్పాటు చేసుకుని వాహనదారులనుంచి సుంకం వసూలు చేసుకునే వెసలుబాటు కల్పించారు. కొన్నేళ్లపాటు ఏజెన్సీలకు సుంకం వసూలు చేసుకునే అవకాశం ఉంది. రాష్ట్ర వ్యాప్తంగా జాతీయరహదారులపై ఉండే టోల్‌గేట్ల ద్వారా రోజూ కోట్లాదిరూపాయలు సుంకం వసూలు చేస్తారు. టోల్ వసూలు చేసే ఏజెన్సీలు రాష్ట్ర ప్రభుత్వానికి స్టాంప్ డ్యూటీ చెల్లించడం లేదు. అటువంటి ఏజెన్సీలపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరించడం లేదు. ఇలా కొన్నేళ్లుగా సాగుతుండడంతో వారిలో నిర్లక్ష్యం పెరిగింది. స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ల శాఖ స్టాంప్‌డ్యూటీ చెల్లించాలని నోటీసులు జారీ చేసినా పట్టించుకోవడం లేదు. ఎంత మేర పన్ను వసూలు చేస్తున్నా అందులో స్టాంప్‌డ్యూటీ ఎంత మొత్తం ప్రభుత్వానికి చెల్లించాలనే రికార్డులు కూడా సమర్పించడం లేదని తెలుస్తోంది. బెళగావికి చెందిన సామాజిక కార్యకర్త ప్రశాంత్ బుర్గె రెండుమూడేళ్లుగా ప్రభుత్వానికి టోల్ ఏజెన్సీలద్వారా జరుగుతున్న అన్యాయంపై నిలదీస్తూనే ఉన్నారు. కొత్త ఏడాది ప్రారంభంలో అన్ని టోల్ ఏజెన్సీలకు రిజిస్ట్రేషన్ శాఖ ఇన్‌స్పెక్టర్ జనరల్ నోటీసులు జారీ చేశారు. కొన్ని ఏజెన్సీలు కాంట్రాక్టు వ్యవధి ముగియడంతో రెన్యువల్ చేసుకున్నారు. ఇలా కొత్తగా టోల్ ఏజెన్సీలు పొందినవారు కొంత మేర పన్నులు సక్రమంగా చెల్లిస్తున్నట్టు అధికారుల ద్వారా తెలుస్తోంది.

రూ.500 కోట్ల బకాయిలు

రాష్ట్రంలో జాతీయ రహదారులకు అనుబంధంగా 53 టోల్‌గేట్లు సుంకం వసూలు చేస్తున్నాయి. కర్ణాటక రిజిస్ట్రేషన్ చట్టం 1957 ఆర్టికల్ 32ఏ నిబంధన కింద జాతీయ రహదారి ప్రాధికారతో చేసుకున్న ఒప్పందం ప్రకారం ఒకశాతం స్టాంప్‌డ్యూటీ చెల్లించాల్సి ఉంటుంది. రాష్ట్రవ్యాప్తంగా ఉండే 53 టోల్‌గేట్ల ఏజెన్సీలు ఏకంగా రూ.500కోట్లు మేర బకాయి ఉన్నట్లు తెలుస్తోంది. బెళగావి జిల్లా టోల్ ఏజెన్సీ 69.90 కోట్ల రూపాయల బకాయి పెట్టింది. మూడేళ్ల కాంట్రాక్టు పొందిన దావణగెరె టోల్ ఏజెన్సీ రూ.2.50 లక్షలు చెల్లించాల్సి ఉండగా కేవలం రూ.2,100 మాత్రమే చెల్లించారు. ఇదే తరహాలో 50 టోల్ ఏజెన్సీలు బకాయిలు ఉన్నట్లు తెలుస్తోంది.

ఏజెన్సీల ఆగడాలు

టోల్‌గేట్ల ద్వారా వాహనదారులనుంచి పన్ను వసూలు చేసే ఏజెన్సీల ఆగడాలు తరచూ వివాదాలుగా మారుతుంటాయి. జాతీయ రహదారికి అనుబంధమైన టోల్ అయినా సమీప గ్రామాలవారికి, ప్రభుత్వ వాహనాలు, అత్యవసర వాహనాలు, వీవీఐపీల వాహనాలకు వెసలుబాటు ఉంది. కానీ పలు సందర్భాలలో స్థానికులకు ఉచితంగా వెళ్లేందుకు అభ్యంతరాలు తెలుపుతుంటారు. ఇలా ఏజెన్సీలు, స్థానికుల మధ్య పలుమార్లు గొడవలు జరిగిన సందర్భాలూ ఉన్నాయి. కొన్నేళ్లకిందట బెంగళూరు శివారులోని హొస్కోటె వద్ద ఉండే టోల్‌ను స్థానికులు ధ్వంసం చేసిన విషయం తెలిసిందే. బాగేపల్లి, బెళగావి, దావణగెరె, మైసూరు రోడ్డు, బెంగళూరు ఎయిర్‌పోర్ట్ రోడ్డు, మంగళూరు రోడ్డులోని టోల్‌గేట్‌ల వద్ద గొడవలు జరిగిన విషయం తెలిసిందే. టోల్ ఏజెన్సీల అక్రమాలను అరికట్టే దిశగా ప్రభుత్వం చొరవ చూపాలనే డిమాండ్ పెరుగుతోంది.



ప్రత్యేక పరీక్షలకు బ్రేక్

- ఇంజనీరింగ్‌లో ప్రవేశానికి కొత్త విధానం
- ఇక ప్రైవేట్ వర్సిటీల పరీక్షలుండవు
- సీఈటీ, జేఈఈ, కామెడ్-కే మార్కులే పరిగణన

బెంగళూరు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ కళాశాలలో ప్రవేశానికి రానున్న విద్యాసంవత్సరం నుంచి కొత్త విధానం అమలులోకి రానుంది. ఇకపై ప్రైవేట్ యూనివర్సిటీలలో ఇంజనీరింగ్ కోర్సుల్లో చేరబోయే విద్యార్థులకు సంబంధిత వర్సిటీలు ప్రత్యేకంగా పరీక్షలు నిర్వహించే అవకాశం ఉండదు. సీఈటీ, కామెడ్-కే, జేఈఈ ప్రవేశ పరీక్షల్లో వచ్చిన మార్కుల ద్వారానే ప్రైవేట్‌వర్సిటీల్లోనూ సీట్లు పొందాల్సి ఉంటుంది. కొన్నేళ్లుగా ప్రైవేట్ యూనివర్సిటీలు ఇంజనీరింగ్ కోర్సుల్లో ప్రవేశానికై సొంతంగా ప్రవేశ పరీక్షలు జరిపేవి. యూనివర్సిటీలు దేశవ్యాప్తంగా ప్రవేశపరీక్షలు ఆన్‌లైన్ విధానంతో కొనసాగించేవి. రాష్ట్రానికి చెందిన విద్యార్థులతోపాటు జాతీయస్థాయిలో ప్రముఖ యూనివర్సిటీల్లో చేరేందుకు పోటీపడేవారు. రాష్ట్రంలో పదులసంఖ్యలో ఉండే ప్రముఖ విశ్వవిద్యాలయాల్లో సీట్లకోసం విద్యార్థులు పోటీ పడేవారు. ఇలా ఏ యూనివర్సిటీలో సీటు వస్తుందోనని సీఈటీ, జేఈఈతోపాటు ప్రైవేట్ యూనివర్సిటీలు నిర్వహించే అన్ని పరీక్షల్లోనూ పాల్గొనేవారు. ఒక్కో విద్యార్థి ఏడెనిమిది పరీక్షలు రాసే పరిస్థితి ఉండేది. విద్యార్థులపై ఒత్తిడిని తగ్గించే దిశగా ఉన్నత విద్యాశాఖ, ప్రైవేట్ యూనివర్సిటీల ప్రతినిధులతో చర్చలు జరిపి ప్రత్యేక ప్రవేశ పరీక్షలు నిర్వహించే విధానాన్ని స్వస్తి పలికాయి. ఇలా 2025-26 విద్యాసంవత్సరంలో ఇంజనీరింగ్‌తోపాటు వృత్తి విద్యాకోర్సుల్లో ప్రవేశానికి యూనివర్సిటీల ప్రత్యేక పరీక్షలు నిలిపివేసినట్లయ్యింది. అయితే ప్రవేశం కోసం సీఈటీతోపాటు జేఈఈ, కామెడ్-కే మార్కులను పరిగణనలోకి తీసుకునేలా నిర్ణయించారు.

ఏప్రిల్ 16నుంచి సీఈటీ

వృత్తి విద్యాకోర్సుల్లో ప్రవేశానికై కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ (సీఈటీ) పరీక్షలు ఏప్రిల్ 16, 17 తేదీల్లో నిర్వహించనున్నారు. మే 10న కామెడ్-కే జరగనుంది. ప్రభుత్వ కోటా సీట్లు సీఈటీ ద్వారానే కేటాయిస్తారు. 150కుపైగా ఇంజనీరింగ్ కళాశాలలు, 20వేల సీట్ల భర్తీకి కామెడ్-కే జరగనుంది. కర్ణాటక పరీక్షా ప్రాధికార సీఈటీ ద్వారా ప్రైవేట్ యూనివర్సిటీల్లో 45శాతం సీట్లను భర్తీ చేస్తారు. మిగిలిన 55శాతం సీట్లను కామెడ్-కే, జేఈఈ మార్కులకు అనుగుణంగా భర్తీ చేయనున్నారు. రాష్ట్రంలో 20 ప్రైవేట్ యూనివర్సిటీలు ఉన్నాయి. ఈ ఏడాది యూనివర్సిటీల ప్రత్యేక పరీక్షలు లేనందున జేఈఈ మార్కులనే కీలకంగా పరిగణించాలని నిర్ణయించాయి. ప్రైవేట్ యూనివర్సిటీలు ప్రత్యేక పరీక్షలు కొనసాగించకపోవడం, కామెడ్-కే, జేఈఈ, సీఈటీ పరీక్షలు భౌతికంగా నిర్వహించడంతోపాటు కౌన్సెలింగ్ కూడా నేరుగా పాల్గొనాల్సి రావడంతో విద్యార్థులు, తల్లిదండ్రులకు సమస్య కానుంది. అయితే యూనివర్సిటీలు నిర్వహించే ప్రవేశపరీక్షల్లో పాల్గొనేందుకు చెల్లించే ఫీజులనుంచి బయటపడినట్లయ్యింది.

దొంగ పోలీసులు..!

తనిఖీల పేరుతో రైతు నుంచి రూ.30 వేలు కాజేసిన నకిలీలు

6

విద్యుత్ చౌర్యం కేసులో రూ.18 లక్షల జరిమానా

2022 నాటి కేసులో బళ్లారి జిల్లా సెషన్స్ కోర్టు తీర్పు

పేదింట విజయ లక్ష్మి..!

- నాన్న కార్మికుడు, తల్లి కూరగాయల వ్యాపారం
- పట్టుదలతో ఎంబీబీఎస్ పూర్తి చేసిన దేశ్‌మానె
- కేన్సర్ బాధితుల పాలిట ఆశాకిరణం
- పద్మశ్రీ పురస్కారంపై సర్వత్రా హర్షం

బెంగళూరు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): మారుమూల పల్లెలో నిరక్షరాస్యులైన దంపతులకు జన్మించి ఒక ఆశయంతో వైద్యురాలిగా సేవలందిస్తూ ఎంతోమంది కేన్సర్ బాధితులపాలిట ఆశాకిరణమని పేరుతెచ్చుకున్న విజయలక్ష్మి దేశ్‌మానెకు అత్యున్నతమైన పద్మశ్రీ పురస్కారం దక్కడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. కలబురగి జిల్లా జేవర్గి తాలూకా కోబాళ గ్రామంలో బాబురావ్ దేశ్‌మానె, రత్నమ్మలకు 1955లో విజయలక్ష్మి దేశ్‌మానె జన్మించారు. తండ్రి బాబురావు ఎంఎస్‌కే మిల్లులో కార్మికుడు కాగా తల్లి రత్నమ్మ ఇంటింటికి వెళ్లి కూరగాయలు, ఆకుకూరలు విక్రయించేవారు. బాబురావు, రత్నమ్మ దంపతులకు 8మంది సంతానం కాగా అందరికంటే విజయలక్ష్మి పెద్దవారు. గాజిపుర, చక్కెరఘట్ట పాఠశాలలో ఏడో తరగతి దాకా కన్నడ మీడియంలో చదివారు. ఆ తర్వాత గంగాంబిక హైస్కూల్‌లో చదువుతూ తల్లితోపాటు కూరగాయలు అమ్మేందుకు వెళ్లేవారు. కార్మికుడైన తండ్రి అనారోగ్యంపాలు కావడంతో కలబురగి ఈఎస్ఐ ఆసుపత్రిలో చికిత్సలకోసం చేర్పించిన వేళ తండ్రికి వైద్యసేవలందిస్తున్న డాక్టర్లను చూసి ఎంతకష్టమైనా డాక్టర్ కావాలని పట్టుదల వచ్చిందని విజయలక్ష్మి ఇటీవల తెలిపారు. 1984లో కేఎంసీ ద్వారా ఎంబీబీఎస్, బళ్ళారి మెడికల్ కళాశాలలో ఎంఎస్ పూర్తి చేశారు. కోర్సు పూర్తి కాగానే బెంగళూరులోని కిద్వాయ్ మెమోరియల్ కేన్సర్ ఆసుపత్రిలో రెసిడెంట్ డాక్టర్‌గా చేరారు. 1994లో తొలి మహిళా ప్రాధ్యాపకురాలిగా వ్యవహరించారు. ఆ తర్వాత కిద్వాయ్‌లోనే డీన్, హెచ్‌ఓడీ, డైరెక్టర్‌గా సేవలందించారు. విజయలక్ష్మి దేశ్‌మానెకు 2004లో రాజ్యోత్సవ పురస్కారం దక్కింది. కలబురగి జిల్లా చమ్మార సామాజిక వర్గం నుంచి పద్మశ్రీ పురస్కారం పొందిన తొలి వ్యక్తిగా గుర్తింపు పొందారు. పలు సందర్భాలలో విజయలక్ష్మి దేశ్‌మానె మాట్లాడుతూ తల్లిదండ్రుల మద్దతు, ఆరాధించే శ్రీకృష్ణుడి ఆశీస్సులతోనే అవకాశాలు వచ్చాయన్నారు. ఎనిమిదిమంది సంతానంలో ఆరుగురు పీహెచ్‌డీ చేశారు. కిద్వాయ్ కేన్సర్ ఆసుపత్రిలో సుదీర్ఘకాలంగా సేవలందించిన విజయలక్ష్మి దేశ్‌మానెకు పద్మశ్రీ పురస్కారం దక్కడంపై తోటి వైద్యులు, ఉద్యోగులు ఆమెను ప్రత్యేకంగా అభినందించారు.



పద్మశ్రీ పురస్కార గ్రహీత విజయలక్ష్మి దేశ్‌మానె

దేవదాసీ దురాచారాన్ని రూపుమాపాలి

- చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత ఎస్పీ, డీఎస్పీలదే
- పోక్సో కేసుల్లో జాప్యం సరికాదు
- అధికారుల సమీక్షలో సీఎం



విధానసౌధలో పోలీసు అధికారులతో సమీక్షలో సీఎం సిద్దరామయ్య, సీఎస్ శాలినీ రజనీశ్, మంత్రులు

బెంగళూరు, జనవరి 28(ఆంధ్రజ్యోతి): దేవదాసీ పద్ధతి ఎప్పుడో నిషేధింపబడిందని ఎక్కడైనా వెలుగులోకి వస్తే సంబంధిత జిల్లా అధికారి, ఎస్పీలదే బాధ్యత అని సీఎం సిద్దరామయ్య హెచ్చరించారు. మంగళవారం విధానసౌధలో వివిధశాఖల ప్రగతికి సంబంధించి సమీక్ష జరిపారు. దేవదాసీ విధానం అనాగరికమన్నారు. వారికి ఉపాధి చూపి ఆ విధానం నుంచి బయటకు తీసుకొచ్చామని, ఆధునికయుగంలో అదే పద్ధతి సరికాదన్నారు. తీవ్రమైన కేసుల్లో వెంటనే బెయిల్ ఎలా సాధ్యమని ప్రశ్నించారు. అట్రాసిటీ కేసుల విషయంలో నిబంధనలు పాటించాలని, జాప్యం చేయరాదని సీఎం సూచించారు. ఆరు నెలలకోసారి ఉన్నతస్థాయి సమావేశం జరగాలని తద్వారా సమస్యల పరిష్కారం సాధ్యమన్నారు. రాయచూరు అంబేడ్కర్ సర్కిల్‌లో ప్రగతిపరసంఘాల క్రియాసమితి మహిళలు నిరంతర నిరసనపై సీఎం ప్రస్తావించారు. అట్రాసిటీ కేసుల్లో 60రోజుల్లోపు చార్జ్‌షీట్ దాఖలు చేయాలని, జాప్యం జరిగితే అడ్వకేట్ జనరల్‌తో చర్చించాలన్నారు. ఎస్సీలపై హత్యలు, అత్యాచారాల కేసులు త్వరితగతిన పరిష్కారమయ్యేలా చేపట్టాలని సూచించారు. బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీకి శాఖలవారీగా వివరాలు ఇవ్వాలని చీఫ్ సెక్రటరీని కోరారు. జిల్లాస్థాయిలో జిల్లా అధికారులు మూడు నెలలకోసారి సమీక్షలు జరపాలని కోరారు. సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాలిని రజనీశ్, మంత్రులు మహదేవప్ప, రాజణ్ణ, పరిషత్ ప్రతిపక్షనేత చలవాది నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

'కెనరా క్రెస్ట్'కు శ్రీకారం చుట్టిన కెనరాబ్యాంకు

బెంగళూరు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): మారుతున్న జీవనశైలి డిమాండ్లకు అనుగుణంగా ప్రభుత్వరంగ కెనరాబ్యాంకు 'కెనరా క్రెస్ట్' సభ్యత్వానికి మంగళవారం శ్రీకారం చుట్టింది. వ్యక్తిగత ప్రీమియం బ్యాంకింగ్ సేవలను అనుసంధానం చేయనున్నారు. ఖాతాదారులు కెనరాబ్యాంకులోని ఏ శాఖనుంచైనా వ్యక్తిగతమైన ప్రాధాన్యతా సేవలను పొందే అవకాశం ఉంది. అర్హులైన ఖాతాదారులు, సరళమైన డిజిటల్ ఇంటర్‌ఫేజ్ ద్వారా క్రెస్ట్ కార్యక్రమంలో చేరవచ్చు. బ్యాంకు సేవలతోపాటు ప్రత్యేకమైన జీవనశైలి సౌలభ్యాలు కూడా వర్తించనున్నాయి. సభ్యులు ఈసీ డైనర్ సభ్యత్వం కల్గిన ప్రీమియం హోటళ్లలో కానుకలను ఆనందించవచ్చు. ఫిట్‌పాస్ ప్రొమ్యాక్స్ సభ్యత్వంతో జిమ్ ప్రవేశం పొందవచ్చు. ఎటువంటి సమయంలోనైనా చెక్ ఇన్ సదుపాయం కల్గిన విలాసవంతమైన హోటళ్లలో ప్రయోజనాలను పొందవచ్చు. గ్లోబల్ స్థాయిలో పేరొందిన వైద్యులనుంచి సెకండ్ ఓపీనియన్ ప్రయోజనం కూడా పొందేందుకు వీలుంది. కెనరాబ్యాంకు శాఖలలో ప్రాధాన్యతా సేవలు అందుబాటులో ఉంటాయని, 24 గంటలపాటు కాల్‌సెంటర్ ద్వారా కూడా బ్యాంకు ప్రయోజనాలు పొందేందుకు వెసలుబాటు ఉంటుంది. కెనరా క్రెస్ట్ కార్యక్రమంలో క్రెస్ట్, క్రెస్ట్ ప్లస్ అనే రెండు విభాగాలు ఉన్నాయి. రూ.10లక్షలనుంచి 50లక్షలు దాకా, రూ.50లక్షలకుపైగా బ్యాలెన్స్ కల్గిన ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవచ్చు. ఎటువంటి అదనపు భారం లేకుండా సభ్యులుగా చేరవచ్చు. కెనరాక్రెస్ట్ సభ్యత్వం పొందడం ద్వారా ఖాతాదారులు అర్హత కల్గిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవడంతోపాటు ఉన్నతమైన బ్యాంకింగ్ సేవల అనుభవాన్ని పొందేందుకు వీలుందని ప్రకటించారు.



రథోత్సవంలో భక్తుల సందడి

వైభవంగా శివయోగి జాతర

మైసూరు జిల్లాలోని సుత్తూరు మఠం శివరాత్రీశ్వర శివయోగి స్వామీజీ రథోత్సవం మంగళవారం అంగరంగ వైభవంగా జరిగింది. జిల్లావ్యాప్తంగా వివిధ ప్రాంతాల భక్తులు తరలి వచ్చి స్వామిని దర్శించుకున్నారు. రథంపై అరటి పండ్లు, దవనం వేసి మొక్కులు తీర్చుకున్నారు. మఠాధిపతి శివరాత్రి దేశికేంద్ర మహాస్వామి నేతృత్వంలో ఏర్పాటైన రథోత్సవానికి మాజీ డీసీఎం అశ్వత్థనారాయణ సహా పలువురు రాజకీయ ప్రముఖులు పాల్గొన్నారు. భక్తులకు అన్న దాసోహం నిర్వహించారు.

- ఆంధ్రజ్యోతి, బెంగళూరు



అనంతపురంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్



కొత్తచెరువులో మాట్లాడుతున్న మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి

ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహించిన 'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా..' కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. అనంతపురం ఆదర్శ కాలనీ, కొత్తచెరువు బీసీ కాలనీలో సభలకు వెయ్యిమందికి పైగా ప్రజలు హాజరయ్యారు. కొందరు నేరుగా గళం విప్పి తమ సమస్యలను ఎమ్మెల్యేలు, అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. మరికొందరు వినతిపత్రాలను సమర్పించారు. అనంతపురంలో అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, కొత్తచెరువులో పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరా రెడ్డి ప్రజల సమస్యలను నోట్ చేసుకుని, అంశాలవారీగా స్పందించారు. కొన్నింటికి తక్షణ పరిష్కారం చూపించారు. మిగిలినవాటి పరిష్కారానికి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. క్షేత్రస్థాయిలో సమగ్రంగా పరిశీలించి, తమకు నివేదిక ఇవ్వాలని సూచించారు. ఆంధ్రజ్యోతి అక్షరంపై విశ్వాసం ఉంచి.. అరుదైన ఈ కార్యక్రమానికి జనం భారీగా తరలిరావడం విశేషం. సామాజిక బాధ్యతగా ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ చేపట్టిన ఈ కార్యక్రమం ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతుందని ప్రజాప్రతినిధులు, అధికారులు, పాఠకులు హర్షం వ్యక్తం చేశారు.

- ఆంధ్రజ్యోతి, ధర్మవరం, అనంతపురం క్రైం

అక్షరంపై విశ్వాసం

ఆంధ్రజ్యోతి -ఏబీఎన్ వేదికపై ప్రజాగళం

- సమస్యలపై వెల్లువలా వినతులు.. ఫిర్యాదులు...
- ఓపికగా ఆలకించిన ప్రజాప్రతినిధులు, అధికారులు
- ప్రాధాన్యక్రమంలో పరిష్కారానికి అక్కడికక్కడే హామీ





సమస్యలు తెలిపేందుకు వచ్చిన అనంతపురంవాసులు



చిత్రావతి, వంగపేరు బ్రిడ్జిలపై ఎత్తు పెంచాలి.

- పూల శివప్రసాద్, జనసేన మండల కన్వీనర్, కొత్తచెరువు

పీఆర్ జేఈ: వర్షాలు వచ్చినప్పుడు వంగపేరు, చిత్రావతి నది పొంగి పొర్లడంతో ఆమిదాలకుంట, మరుకుంటపల్లి, కొత్తచెరువు సమీపంలో బ్రిడ్జిపై నీరు రోడ్డుపై ప్రవహిస్తున్న మాట వాస్తవమే. ఈ విషయాన్ని ఆర్అండ్‌బీ అధికారులు, పంచాయతీ రాజ్ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం.



బీసీకాలనీలో మా ఇళ్లమీద 33కేవీ లైన్ వెళ్తోంది. దీంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. సమస్యను పరిష్కరించండి.

ఒలిపి శ్రీనివాసులు, టీడీపీ కొత్తచెరువు పట్టణ కన్వీనర్



ట్రాన్స్‌కో ఏఈ, వెంకటేశ్ నాయక్: బీసీకాలనీలోని ఇళ్లపై 33 కేవీ విద్యుత్‌లైన్ వెళ్లడం వాస్తవమే. ఇటీవల ప్రమాదాలు జరగకుండా వైర్ల ఎత్తు పెంచాం. లైన్ మార్చడం నా పరిధిలో లేదు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి సైతం తీసుకెళ్లాం.

వ్యవసాయ బావులకు సరఫరా అయ్యే విద్యుత్ కేబుల్ కాలి పోయింది. పంటలు ఎండుతున్నాయి. సమస్యను పరిష్కరించాలని పలు మార్లు ట్రాన్స్‌కో అధికారులకు చెప్పినా పట్టించుకోలేదు.

- బీడుపల్లి సుబ్బరాయుడు, కొత్తచెరువు




శివరాం, ట్రాన్స్‌కో ఈఈ: విద్యుత్ కేబుల్ కాలి పోయిన విషయం వాస్తవమే. అయితే తలమర్ల సబ్ స్టేషన్ నుంచి వ్యవసాయ బావులకు విద్యుత్ సరఫరా అందిస్తున్నాం. లో ఓల్టేజ్ లేకుండా సమస్యను పరిష్కరిస్తాం. కేబుల్ కోసం ప్రతిపాదనలు పంపాం. కేబుల్‌రాగానే ఏర్పాటు చేస్తాం.



ప్రశ్న: జగనన్న కాలనీ కోసం 14 ఎకరాల భూములు తీసుకున్నారు. పరిహారం కోసం మాజీ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డికి విన్నవించాం. అధికారుల చుట్టు తిరిగినా పట్టించుకోలేదు. ఎక్కువగా మాట్లాడితే కేసులు బనాయిస్తామని బెదిరించారు. భూములు కోల్పోయాం. పైసా పరిహారం ఇవ్వలేదు.

- నాగేంద్రప్రసాద్, రైతు, కొత్తచెరువు



జగనన్న లే ఔట్‌కు 1.30 ఎకరాల భూమి ఇచ్చాం. పరిహారం రూ.50లక్షలు, ఇళ్లపట్టాలు ఇస్తామన్నారు. ఇంత వరకు ఇవ్వలేదు.

- పీవీ నవీన్‌కుమార్, సాగునీటిసంఘం అధ్యక్షుడు



డీటీ బాలాంజనేయులు: ఎక్కడైనా పరిహారం చెల్లించిన తరువాతనే భూమిని స్వాధీనం చేసుకుంటారు. కానీ గతంలో ఇది ఎలా జరిగిందో పరిశీలించి న్యాయం చేస్తాం. అదేవిధంగా జగనన్న కాలనీకి దారి కోసం తీసుకున్న భూ బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు చేపడతాం.



ప్రమాదంలో చెయ్యి పోయింది. మా ఆయన కూడా మంచాన పడ్డాడు. కుటుంబం గడవడం కష్టమైంది. పింఛన్ కోసం పలు మార్లు దరఖాస్తు చేసుకున్న మంజూరు కాలేదు. పింఛన్ మంజూరు చేయించండి.

-నాగరత్న, కొత్తచెరువు

ఈఓ: త్వరలో పింఛన్ దరఖాస్తుకు సైట్ ఓపెన్ అవుతుంది దరఖాస్తు చేసుకుంటే పింఛన్ మంజూరయ్యేలా చూస్తాం.

పింఛన్ ఇచ్చి ఆదుకోండి సార్..



ఎమ్మెల్యే సార్... నాకు ఎవరూ లేరు. గతంలో పింఛన్ వచ్చేది. కరెంటు బిల్లు ఎక్కువ వస్తోందని 2021లో పింఛన్ తీసేశారు. అడిగితే ఎవరూ ఏమీ చెప్పడం లేదు. నేను టీడీపీ సానుభూతిపరురాలనే పింఛన్ తీసేశారు. నాకు పింఛనే ఆదరవు. ఆరోగ్యం బాగోలేదు. మాత్రలు కొనుక్కుందామన్నా డబ్బులు లేవు. నాకు మళ్లీ పింఛన్ ఇప్పించి ఆదుకోండి సార్.

- అచ్చమ్మ, విద్యుత్‌నగర్, అనంతపురం

ఎమ్మెల్యే: టీడీపీ సానుభూతిపరురాలనే కారణంగా పింఛన్ తొలగించారని అచ్చమ్మ చెబుతున్నారు. ఆమెకు ఆదరణ లేదు. న్యాయబద్ధంగా రావాల్సిన ఫించన్ రానివ్వడం లేదు. కొత్త పింఛన్లు శాంక్షన్ కాగానే మొదటి ఫించన్ ఆమెదే అవుతుందన్నారు.

సింగిల్ ఫేజ్‌తో ఇబ్బందులు



ఆదర్శ కాలనీలో సింగిల్ ఫేజ్ లైన్‌తో కరెంటు సమస్య ఏర్పడుతోంది. త్రిబుల్ ఫేజ్ లైన్ ఇవ్వాలని పలుమార్లు కోరినా ఎవరూ పట్టించుకోవడం లేదు. హౌసింగ్ బోర్డు మెయిన్ రోడ్డులో విచ్చలవిడిగా బంకులు ఉన్నాయి. రోడ్డుకు ఇబ్బంది మారింది. లక్ష్మీనరసయ్య కాలనీలో లో ఓల్టేజీ సమస్య ఉంది. రోడ్లు లేవు. డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంది. సమస్యలను పరిష్కరించండి సార్...

- దాసరి శ్రీనివాసులు, ఆదర్శనగర్

ఎమ్మెల్యే: ఎస్ఈతో మాట్లాడి త్రీఫేజ్ విద్యుత్ ఇచ్చేలా చూస్తాం. మిగిలిన సమస్యలను కూడా సాధ్యమైనంత త్వరగా పరిష్కరిస్తాం.

ఇల్లు లేదు.. పింఛన్ లేదు..



సార్..! నాకు పింఛన్ లేదు. ఇల్లు లేదు. ఎలాంటి ఆదరవు లేదు. ఎన్ని సార్లు ఎంత మందిని అడిగినా పట్టించుకోవడం లేదు. సచివాలయానికి వెళ్లి అడిగితే వారు ఏవేవో చెబుతున్నారు. అర్థం కావడం లేదు. నాకు ఇల్లు కట్టించి, పింఛన్ ఇప్పించండి.

- ఫాతిమా, ఆదర్శనగర్

ఎమ్మెల్యే: మున్సిపల్ కమిషనర్‌తో మాట్లాడి మీ సమస్యలను పరిష్కరిస్తాం.

రైతు బజారు ఏర్పాటు చేయండి



ఆదర్శ నగర్ నుంచి పాతూరుకు వెళ్లి సరుకులు, కూరగాయలు తెచ్చుకోవాలంటే రవాణా ఖర్చులు అధికమవుతున్నాయి. చాలా మంది వ్యాపారులు ఇబ్బందులు పడుతున్నారు. కాలనీలో చాలా చోట్ల ఖాళీ స్థలాలున్నాయి. ఏదో ఒకచోట రైతు బజారు ఏర్పాటు చేస్తే మాలాంటి వ్యాపారులకు ఇబ్బందులు తప్పుతాయి.

- నరసింహారెడ్డి, వ్యాపారి

ఎమ్మెల్యే: రైతు బజారు ఏర్పాటుకు మనకు అవకాశం ఉంది. 50 సెంట్ల ఖాళీ స్థలం ఉంటే చూడమని కమిషనర్‌ను కోరుతున్నాం. స్థలం కేటాయించగానే రైతు బజారు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాము.

రొమ్ము క్యాన్సర్‌తో...



సార్..! నేను రొమ్ము క్యాన్సర్‌తో ఇబ్బంది పడుతున్నాను. నాకు ఇద్దరు పిల్లలున్నారు. కూలి పనులు చేసుకుంటూ వారిని పోషిస్తున్నాను. ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నాను. నాకు పింఛన్ ఇప్పించి ఆదుకోండి సార్.

- రమ, కూలీ, అనంతపురం

ఎమ్మెల్యే: ప్రభుత్వం తరఫున ఏమాత్రం అవకాశమున్నా వైద్యానికి సాయం చేస్తాం. పింఛన్ అందించి ఆదుకుంటాం.

సెల్ టవర్ తొలగించండి




సార్..! 32వ డివిజన్‌లో సెల్ టవర్లు అధికమయ్యాయి. ఎక్కడా చూసినా సెల్ టవర్లు ఉన్నాయి. రేడియేషన్ ఎక్కువవుతోంది. కాలనీలో ఎంతో మంది క్యాన్సర్ బారిన పడ్డారు. నొప్పులతో ఇబ్బందులు పడుతున్నారు. సమస్యను పరిష్కరించి ఆదుకోండి.

- రవిశంకర్, ఆదర్శనగర్, అనంతపురం

ఎమ్మెల్యే: సెల్ టవర్ల సమస్య ఆదర్శనగర్‌లోనే కాదు... దేశవ్యాప్తంగా ఉంది. టెక్నికల టీమ్‌తో మాట్లాడి.. ఒకే టవర్ మీద అన్నింటినీ ఏర్పాటు చేయిస్తాం.

ఖాళీ స్థలాలను క్లీన్ చేయించండి...



ఆదర్శ కాలనీలో చాలా ప్రైవేట్ స్థలాలున్నాయి. వాటిలో కంపచెట్లు, చెత్తాచెదారం నిండుకోవడంతో అపరిశుభ్రంగా తయారయ్యాయి. దుర్వాసనతో ఇబ్బందిపడుతున్నాం. ఇళ్లలోకి విషపురుగులు వస్తున్నాయి. చెత్తను, ముళ్ల పొదలను తొలగించండి.

- చిన్నకొండయ్య, అనంతపురం

ఎమ్మెల్యే: ఆదర్శ నగర్‌తోపాటు నగరంలోని ఖాళీ స్థలాలన్నింటినీ శుభ్రం చేయిస్తాం. ఇప్పటికే ఎంహెచ్‌ఓకు సూచనలు ఇచ్చాం. ప్రతి కాలనీలో స్పెషల్ డ్రైవ్ చేపట్టి, ఖాళీ స్థలాల యజమానులను పిలిపించి శుభ్రం చేయిస్తాం. ఇప్పటికే శారదా నగర్‌లో శుభ్రం చేయించాము. యజమాని రాకపోతే మేమే శుభ్రం చేయించి, వారికి జరిమానా విధిస్తాం.

ఆస్పత్రిని నిర్మించండి



స్కేటింగ్ మైదానంతో ఎవరికీ ఉపయోగం లేదు. ఎవరో కొంత మంది పిల్లలు వస్తున్నారు. ఆ స్థలంలో ఆస్పత్రిగాని, పాఠశాలగాని ఏర్పాటు చేస్తే పేద ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుంది. కాలనీలో మురుగు కాలువలు అధ్వానంగా ఉన్నాయి. సమస్యలను పరిష్కరించండి

- ఆంజనేయులు, రిటైర్డ్ హెచ్ఎం, అనంతపురం

ఎమ్మెల్యే: స్కేటింగ్ స్థలం వందమంది విద్యార్థులకు ఉపయోగపడుతోంది. పాఠశాల, ఆస్పత్రి కావాలంటే వేరే స్థలం చూసి ఏర్పాటు చేయిస్తాం. విద్య, వైద్యం ఎంత అవసరమో.. క్రీడలూ అంతే అవసరం.


ఇళ్లు, పింఛన్ ఇప్పించండి..



నాకు ఇళ్లు లేదు. కొన్నేళ్లుగా అధికారులు, రాజకీయ నాయకులను అడుగుతున్నాను. ఎవరూ పట్టించుకోవడం లేదు. పింఛన్ కూడా రావడం లేదు. డబ్బు అవసరమొస్తే ఇబ్బందులు పడుతున్నాను. నాకు ఒక గూడు ఏర్పాటు చేసి, పింఛన్ ఇప్పిస్తే బతుక్కుంటాను.

- నాగమ్మ, ఆదర్శనగర్, అనంతపురం

ఎమ్మెల్యే: మీకు న్యాయం జరుగుతుంది. నగరవాసులకు 880 ఇళ్లు మంజూరయ్యాయి. మీకు స్థలం ఉంటే ఇంటిని మంజూరు చేయిస్తాం. స్థలం లేకుంటే.. స్థలం చూపించి ఇల్లు కట్టించి ఇస్తాం. పింఛన్ మంజూరు చేయిస్తాం.



అధికారులకు ఆదేశాలు జారీ చేస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి



కొత్తచెరువు నుంచి గోరంట్ల పల్లికి వెళ్లే రోడ్డు పనులు చేపట్టారు. అయితే కొంత వరకే చేసి వదిలేశారు. దీంతో దారి లేక ఇబ్బందులు పడుతున్నాం.

-శీనా, కురుబ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్

రోడ్లు కబ్జా అవుతున్నాయి..



ఆదర్శ నగర్ 341 సర్వే నంబర్‌లో రోడ్డు లైన్ లేదు. కంపచెట్లు ఏపుగా పెరిగిపోయాయి. దారిలో వెళుతున్నప్పుడు ముళ్ల తగిలి గాయపడుతున్నాం. ఇబ్బందికరంగా ఉంది. 31 సర్వే నంబర్‌లో రోడ్లను కొందరు కబ్జా చేస్తున్నారు. వాటిని వెంటనే కాపాడి రోడ్లు నిర్మించాలి. మరికొన్ని చోట్ల రోడ్లలో గుంతలు ఏర్పడ్డాయి. వాటిని పూడ్చాలి.

- చెన్నకేశవ, అనంతపురం

ఎమ్మెల్యే: వైసీపీ ప్రభుత్వంలో రోడ్లను ఆక్రమించారు. ఈ విషయాన్ని ప్రభుత్వానికి తెలియజేశాను. వీలైనంత త్వరగా రోడ్లు, డ్రైనేజీ సమస్యను పరిష్కరిస్తాం.

రోడ్డు నిర్మించాలి



హమాలీ కాలనీ వాటర్ ట్యాంకు వద్ద 40 అడుగుల రోడ్డుకు చాలాసార్లు భూమి పూజ చేశారు. పనులు ప్రారంభమయ్యాయి. కానీ పూర్తి చేయడంలేదు. ప్రతిసారీ ఇలాగే జరుగుతోంది. కాలనీలో కంపచెట్లు పెరిగి అధ్వాన్నంగా ఉంది. పలు రోడ్లపై గుంతలు పడ్డాయి. వెంటనే రోడ్ల నిర్మాణం చేపట్టాలి.

- మహబూబ్ పీరా, రిటైర్డ్ పోలీస్ ఆఫీసర్, అనంతపురం

ఎమ్మెల్యే: వైసీపీ ప్రభుత్వంలో రూ.25 కోట్ల స్పెషల్ గ్రాంట్ తీసుకొచ్చారు. రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేసి వదిలి పెట్టారు. ఎక్కడా పనులు ప్రారంభించిన దాఖలాలు లేవు. ఆ పనుల టెండర్లు క్యాన్సిల్ అయ్యాయి. కొత్త టెండర్లు పిలిచి రోడ్లు వేయిస్తాం. హమాలీకాలనీలో రోడ్డు పనులను త్వరలోనే ప్రారంభిస్తాం.

పార్కు ఏర్పాటు చేయండి



సార్.. ఆదర్శ నగర్‌లో 40 సెంట్లు కార్పొరేషన్ స్థలం ఉంది. అది కబ్జాకు గురికాకుండా కాలనీవాసుల ఆహ్లాదం కోసం ఒక పార్కును ఏర్పాటు చేయండి. ఆ స్థలంలో కాలనీవాసులకు ఉపయోగపడే ఇతర పనులను కూడా చేపట్టండి.

- రాజారెడ్డి, అనంతపురం

ఎమ్మెల్యే: వాటర్ ట్యాంకు సమీపంలో పార్కు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. అక్కడ ప్రైవేట్ స్థలం ఉంది. కార్పొరేషన్ స్థలం ఉంటే పార్కు ఏర్పాటు చేయిస్తాం.

ఉపాధి చూపండి



ఆదర్శ కాలనీలో నిరుద్యోగులు చాలా మంది ఉన్నారు. టీడీపీ ప్రభుత్వంలో సీమెన్స్‌తో ఒప్పందం చేసుకుని రూ.5 కోట్ల కంప్యూటర్ పరికరాలు కొనుగోలు చేశారు. అవి ఐదారేళ్లుగా జేఎన్‌టీయూలో నిరుపయోగంగా ఉన్నాయి. కాలనీలో సెంటర్ ఏర్పాటు చేసి, వాటి ద్వారా నిరుద్యోగ యువతకు శిక్షణ ఇచ్చి, ఉపాధి చూపండి.

- వన్నూరప్ప, అనంతపురం

ఎమ్మెల్యే: జేఎన్‌టీయూ వీసీతో మాట్లాడి ఆదర్శ నగర్‌కు కంప్యూటర్లు తెప్పిస్తాం. స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ కూడా ఏర్పాటు చేయిస్తాం. యువతకు శిక్షణ ఇచ్చి ఉపాధి మార్గాలను చూపిస్తాం.

మా అన్నకు పింఛన్ ఇప్పించండి..



సార్..! మా అన్న పేరు గణేష్. 90 శాతం వైకల్యం ఉంది. మాకు అమ్మ, నాన్న లేరు. అన్నను నేను చూసుకుంటున్నాను. సదరం సర్టిఫికెట్ కావాలని అడిగితే అధికారులు ఒకరి మీద ఒకరు చెప్పుకుంటున్నారు. పుట్టపర్తి డీఎంహెచ్‌ఓ ఆఫీస్‌కు వెళ్లమని చెప్పారు. పలుమార్లు తిరిగినా వారు పట్టించుకోవడం లేదు. చాలా ఇబ్బంది ఉంది. మా అన్నకు పింఛన్ ఇప్పించండి సార్.

-సాయికుమార్, ఆదర్శనగర్, అనంతపురం

ఎమ్మెల్యే: డీఎంహెచ్‌ఓతో మాట్లాడి మీ సమస్యను పరిష్కరిస్తాం. పుట్టపర్తిలో కాకుండా అనంతపురంలోనే సదరం సర్టిఫికెట్ ఇప్పించి ఫించన్ ఇప్పిస్తాం.



నాగరాజు, పంచాయతీరాజ్ జేఈ: రహదారి పనులకు సబంధించి బిల్లులు కాకపోవడంతో కాంట్రాక్టర్ అర్థంతరంగా పనులు ఆపేశారు. దీంతో రహదారి నిర్మాణం జరగలేదు. ఈవిషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. దీనిపై ఎమ్మెల్యే పల్లె సింధూరా రెడ్డి, మాజీ మంత్రి పల్లెరఘునాథరెడ్డి స్పందిస్తూ ఉపాధి నిధులతో రహదారి, బ్రిడ్జి పనులు చేపట్టే విధంగా ప్రతిపాదనలు పంపాలని ఆదేశించారు.

పంచాయతీలోని సమస్యలు ఇవే



ఎన్టీఆర్ కాలనీలో విద్యుత్ స్తంభాలు, లైట్లు, డ్రైనేజీ సమస్యలను పరిష్కరించాలి. వీధిలైట్లు లేకపోవడంతో మా పిల్లలు ట్యూషన్ నుంచి రాత్రి సమయంలో రావడానికి ఇబ్బందులు పడుతున్నారు. వారిని పిలుచుకురావడానికి టార్చిలైట్ తీసుకుని వెళ్లాల్సి వస్తోంది.

- షాబీర



శ్రీనివాసరెడ్డి, ఈఓ: ఎన్టీఆర్ కాలనీలో విద్యుత్ స్తంభాలు లేక లైట్లు వేయలేక పోయాం. అవసరమైన పనులకు ప్రతిపాదనలు పంపి మంజూరైన వెంటనే పనులు చేపడుతాం. డ్రైనేజీ నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాం. నిధులు రాగానే ఏర్పాటు చేయిస్తాం.



డ్రైనేజీ లేక రోడ్డుపై మురుగు నీరు నిల్వ ఉండి మడుగును తలపిస్తోంది. దీంతో దోమలు అధికమై రోగాల బారిన పడుతున్నాం. కుమ్మరకాలనీ నుంచి వేణుగోపాల్‌నగర్‌కు వెళ్లే రహదారి అక్రమ కట్టడాలతో కుంచించుకుపోయింది. ఈ సమస్యను పరిష్కరించాలి.

- కుల్లాయప్ప

శ్రీనివాసరెడ్డి, ఈఓ: వేణుగోపాల్‌నగర్‌లో 300 మీటర్లు సీసీ రోడ్లు వేశాం. మిగిలిన 300 మీటర్ల సీసీరోడ్డుకు, డ్రైనేజీలకు ప్రతిపాదనలు పంపాం. మంజురు కాగానే పనులు ప్రారంభిస్తాం. రెవెన్యూ అధికారులతో కలిసి కుంచించుకుని పోయిన రోడ్లను సర్వే చేయించి అక్రమ కట్టడాలను తొలగించి వెడల్పు చేస్తాం.



గ్రామంలో 120 రజక కుటుంబాలు ఉన్నాయి. ఇంతవరకు ఒక్క దోబీఘాట్ కూడా లేదు. వెంటనే దోబీ ఘాట్‌ను ఏర్పాటుచేయించాలి. అర్ధసెంటులో నివాసముంటున్నాం. మాకు ఇళ్లపట్టాలు కేటాయించాలి

- చాకలి సుబ్బరాయుడు, మాజీ వార్డు మెంబరు

డీటీ, ఈఓ: రెవెన్యూ అధికారుల తో కలిసి స్థలాన్ని గుర్తించి దోబీఘాట్ ఏర్పాటుకు కృషిచేస్తాం. ఇళ్లస్థలాలు లేనివారు దరఖాస్తులు చేసుకుంటే అర్హులైన వారికి స్థలాలను కేటాయించే విధంగా చూస్తాం.



బీసీ కాలనీలో ఆక్రమణలను తొలగించాలి. నెహ్రూ సర్కిల్ నుంచి ప్రభుత్వ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల వరకు రోడ్డు పక్కన ఉన్న దుకాణాలను తొలగించాలి. వీటి వల్ల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.

- శేషాద్రినాయుడు, బీజేపీ అసెంబ్లీ కన్వీనర్

ఈఓ: బీసీకాలనీలో రోడ్లు ఆక్రమణలకు గురైన మాట వాస్తవమే. మేము ఇది వరకే అక్రమ నిర్మాణాలు తొలగించుకోవాలని నోటీసులు ఇచ్చాం. మరోసారి సర్వే చేయించి ఆక్రమణలను తొలగిస్తాం. అదేవిదంగా పాఠశాలల ప్రహరీ పక్కన ఏర్పాటు చేసుకున్న దుకాణాల యజమానులకు నోటీసులు పంపి వారికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లను రెవెన్యూ అధికారులతో కలిసి చూపిస్తాం.



మాకాలనీలో డ్రైనేజీ లేకపోవడంతో రోడ్లపై మురుగు నీరు పారుతోంది. ఈ సమస్యను పరిష్కరించండి.

- పురాణం దివ్యతేజ, బీజేపీ లీగల్ సెల్ పార్లమెంట్ కో కన్వీనర్

ఈఓ: గ్రామంలోని సీసీరోడ్లకు ఇరు వైపులా డ్రైనేజీ కాలువల నిర్మాణం చేపట్టేందుకు రోడ్ల ను పరిశీలించాం. వాటికి ప్రతిపాదనలు పంపాం. నిధులు రాగానే డ్రైనేజీలు నిర్మాణం చేపడతాం.

నేటి ప్రముఖులు

పోర్ట్రెయిట్ ఆర్టిస్ట్ కె.శ్రీ. శంకరనారాయణ కామ్...

బాలాంత్రపు రజనీకాంతరావు (జయంతి)



బహుముఖ ప్రజ్ఞాశాలి బాలాంత్రపు రజనీకాంతరావు 1920 జనవరి 29న కృష్ణా జిల్లా నిడదవోలులో జన్మించారు. జంట కవులైన వేంకట పార్వతీశ కవుల్లో ఒకరైన బాలాంత్రపు వెంకటరావు వీరి తండ్రి. గాయకుడు, వాగ్గేయకారుడు, రచయిత, స్వరకర్త, తొలితరం సంగీత దర్శకుల్లో ఒకరైన రజనీ కాంతరావు రేడియో శ్రోతలకు సుపరిచితులు. లలిత సంగీత వికాసానికి ఎనలేని కృషితో 'ఆకాశ వాణి'కి జనరంజకం చేశారు. పిల్లలకోసం జేజి మామయ్య పాటలు రచించారు. రేడియో కోసం వందలాది గేయాలను రచించడమే కాక ఇతర రచయితల గీతాలకు కూడా స్వరకల్పన చేశారు. కళాప్రపూర్ణ, కళారత్న, రాగూర్ అకాడమీ రత్న, కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం అందుకున్నారు. 2018 ఏప్రిల్ 22న కన్నుమూశారు.

వేటూరి సుందరరామమూర్తి (జయంతి)



తెలుగు సినీ రచయిత వేటూరి సుందర రామమూర్తి 1936 జనవరి 29న కృష్ణా జిల్లా మోపిదేవి మండలం పెదకళ్లేపల్లిలో జన్మించారు. తొలినాళ్లలో పాత్రి కేయుడిగా పనిచేశారు. కే విశ్వనాథ్ దర్శకత్వం వహించిన 'ఓ సీత కథ' ద్వారా సినీ రంగ ప్రవేశం చేశారు. సంప్రదాయ కవిత్వం నుంచి జానపద గీతాల వరకు అన్నింటిలోనూ తన ప్రతిభను నిరూపించుకున్నారు. పండితుల నుంచి పామరుల వరకు అందరినీ అలరించిన విశిష్టతే ఆయన సొంతం. మహాకవి శ్రీశ్రీ తర్వాత తెలుగు సినిమా పాటకి జాతీయఖ్యాతిని ఆర్జించి పెట్టింది ఆయనే. 8 నంది అవార్డులు సహా మొత్తం 14 అవార్డులు, ఒక జాతీయ పురస్కారం అం దుకున్నారు. 2010 మే 22న కన్నుమూశారు.

గౌరి లంకేశ్ (జయంతి)



సామాజిక ఉద్యమకారిణిగా పేరొందిన గౌరీ లంకేశ్ 1962 జనవరి 29న బెంగళూరులో జన్మించారు. 'టైమ్స్ ఆఫ్ ఇండియా' బెంగళూరు ద్వారా పాత్రికేయ వృత్తిని ప్రారంభించారు. అనంతరం తండ్రి లంకేశ్ ప్రారంభించిన కన్నడ వారపత్రిక 'లంకేశ్'కు సంపాదకులుగా వ్యవహరించారు. అనంతరం సొంత పత్రికను నిర్వహించారు. ముక్కుసూటిగా వ్యవహరించే ధైర్యశాలి అయిన ఆమె నక్సలైట్ సానుభూతి పరురాలిగా గుర్తింపు పొందారు. 2017 సెప్టెంబరు 5న దుండగుల చేతిలో మృతి చెందారు.

ఓల్గా టోకార్‌జుక్ (పుట్టినరోజు)



ప్రముఖ మేధావి, రచయిత్రి ఓల్గా నవోజా టోకార్‌జుక్ 1962 జనవరి 29న జన్మించారు. పోలెండ్ దేశంలో ప్రజలను అమితంగా ప్రభావిత పరిచిన ఆమె సాహిత్యానికి 2018లో నోబెల్ పురస్కారం అందుకున్నారు. 'ఫ్లైట్స్' నవలకు గాను 'మాన్ బుకర్ ఇంటర్నేషనల్ ప్రైజ్' గెలుపొందారు. రాయల్ సొసైటీ ఆఫ్ లిటరేచర్‌లో సభ్యురాలు. ఆమె రచనలు ప్రపంచ వ్యాప్తంగా 40 భాషల్లోకి అనువదించబడటం విశేషం. గౌరవ డాక్టరేట్ ఇతర గౌరవాలు అందుకున్నారు.

రాజ్యవర్ధన్‌సింగ్ రాథోర్ (పుట్టిన రోజు)



'పద్మశ్రీ' గ్రహీత కల్నల్ రాజ్యవర్దన్ సింగ్ రాథోర్ 1970 జనవరి 29న రాజస్థాన్ రాష్ట్రం జైసల్మేర్‌లో జన్మించారు. 2004 ఏథెన్స్‌లో షూటింగ్‌లో ఒలింపిక్ పతకాన్ని గెలుపొందారు. ఆర్మీలో సేవలందించి పదవీ విరమణ పొందాక రాజకీయాల్లోకి వచ్చారు. డబుల్ ట్రాప్ షూటింగ్‌లో చాంపియన్. అర్జున అవార్డు, ఖేల్ రత్న అవార్డులను పొందారు. ఆర్మీలో గ్రెనేడియర్స్ రెజిమెంట్‌లో కమీషన్డ్ ఆఫీసర్‌గా పనిచేసి కల్నల్ హోదాలో రిటైరయ్యారు. 2014లో కేంద్ర సమాచార ప్రసార శాఖా మంత్రిగా, 2017 నుంచి 2019 వరకు కేంద్ర యువజన శాఖ మంత్రిగా పనిచేశారు. ప్రస్తుతం రాజస్థాన్ ఇండస్ట్రీ అండ్ కామర్స్ శాఖల మంత్రిగా కొనసాగుతున్నారు.

కైనన్ చెనై (పుట్టిన రోజు)



ఇండియన్ షూటర్‌గా రాణించిన కైనన్ చెనై 1991 జనవరి 29న హైదరాబాద్‌లో జన్మించారు. ఆయన తండ్రి డేరియస్ చెనై కూడా మాజీ షూటింగ్ చాంపియన్‌గా పేరొందారు. కాగా కైనన్ 50వ జూనియర్ మెన్ ట్రాప్ షూటింగ్‌లోనూ, 51వ నేషనల్ షూటింగ్ చాంపియన్‌లను గెలుపొందారు. 2008లో జరిగిన కామన్‌వెల్త్ యువ క్రీడల్లో బంగారు పతకం సాధించారు. 2016లో ఢిల్లీలో ఆసియా ఒలింపిక్ షూటింగ్ ట్రయల్స్‌లో పై అయ్యారు.

ధర్మవరం పట్టుచీరకు ప్రపంచ ఖ్యాతి

● కేంద్ర చేనేత, జౌళిశాఖ మంత్రి



మంత్రి కి వివరిస్తున్న డిజైనర్ నాగరాజు

ధర్మవరం, జనవరి 28(ఆంధ్రజ్యోతి): ధర్మవరం పట్టుచీర ప్రపంచ ఖ్యాతిని గడించిందని కేంద్ర చేనేత, జౌళిశాఖ మంత్రి గిరిరాజ్ సింగ్ కొనియాడారు. మంగళవారం ఢిల్లీలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సెంటర్ 5 జనపథ్‌లో హ్యాండ్‌లూమ్ ఎక్స్‌పో కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి కేంద్ర ప్రభుత్వం నుంచి ధర్మవరానికి చెందిన డిజైనర్ నాగరాజు హాజరయ్యారు. పట్టుచీరపై డిజైన్ చేసిన అఖండ భారతదేశ చిత్రాన్ని కేంద్రమంత్రికి బహూకరించినట్లు తెలిపారు.

మానవతా విలువలే ముఖ్యం

ముళబాగిలు, జనవరి 28(ఆంధ్రజ్యోతి): కర్ణాటక శాస్త్రీయ పితామహగా పేరొందిన పురందరదాస లక్షలాది కీర్తనలు రచించి మానవతా విలువలను సమాజానికి అందించారని యదుగిరి యతిరాజమఠం డాక్టర్ యదుగిరి యతిరాజ నారాయణ రామానుజజీయర్ పేర్కొన్నారు. పట్టణంలోని హరిదాసపీఠంలో పురందరదాస 52వ వార్షిక ఆరాధన మహోత్సవాన్ని ప్రారంభించి మాట్లాడారు. పురందరదాస రచనలు, కీర్తనలు సాహిత్యంలో విశిష్టస్థానం పొందాయన్నారు. మనస్సుకు ఎంతో ఆహ్లాదం కలిగిస్తాయన్నారు. కాగా 1974లో ఎంఏన్ మూర్తి హంపిలో పురందరదాస ఆరాధన ప్రారంభించారని కొన్నేళ్లకు ముళబాగిలు రాజారావ్ చేపట్టారని 2023 మార్చిలో మృతి చెందడం విషాదనీయమన్నారు. అయినా సమితి మాత్రం ఆరాధన ఉత్సవాన్ని విజయవంతం చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. ఉదయం పురందర విఠల విగ్రహానికి క్షీరాభిషేకం నిర్వహించారు. రుక్మిణి, సత్యభామ సమేత విఠలుడికి పూజలు, అలంకరణలు చేశారు. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న యదుగిరి యతిరాజ నారాయణ రామానుజ జీయర్

ఆలయానికి ఎమ్మెల్యే రూ.5లక్షల విరాళం

విజయనగర్, జనవరి 28(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని పైప్‌లైన్ రోడ్డుకు అనుబంధంగా ఉండే వసహళ్లిలోని ప్లేగ్ మారమ్మ ఆలయానికి రూ.5లక్షల విరాళాన్ని ఎమ్మెల్యే కృష్ణప్ప ప్రకటించారు. మంగళవారం నియోజకవర్గంలో పర్యటించిన సందర్భంగా స్థానికుల సమస్యలను ఆలకించారు. ఇందులో భాగంగా వసహళ్లిలోని ప్లేగ్‌మారెమ్మ ఆలయ పూజల్లో పాల్గొని ఆలయ అభివృద్ధికి రూ.5లక్షల విరాళం ప్రకటించారు. నీటి సమస్య పరిష్కారానికి బోరుబావులను పునరుద్ధరించాలని అధికారులకు సూచించారు. ఇదే సందర్భంగా మాదిగ రిజర్వేషన్ల గురించి కర్ణాటక రాష్ట్ర ఆదిజాంబసంఘం కార్యాధ్యక్షుడు జంబుద్వీప సిద్దరాజు నేతృత్వంలోని బృందం ఎమ్మెల్యేకు వినతిపత్రం సమర్పించారు. శాసనసభ సమావేశాల్లో ప్రస్తావించాలని కోరగా ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. ఈ సందర్భంగా మంజు, ఆదిజాంబవసంఘం ప్రధాన కార్యదర్శి రమేశ్‌కుమార్, శ్రీనివాస్, వార్డు కాంగ్రెస్ సభ్యులు వెంకటేశ్, మునికృష్ణప్ప, మంజు, అనిల్ కుమార్, రమేశ్‌కుమార్, గోవిందరాజు, కదిరేశ్ రాజు, మల్లికార్జున, దురగప్ప, కార్తీక్, కె రామయ్య తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే కృష్ణప్పకు వినతిపత్రం అందచేస్తున్న సంఘం ప్రముఖులు

ఘంటంవారిపల్లిలో బాలల గ్రామసభ

బాగేపల్లి, జనవరి 28(ఆంధ్రజ్యోతి): తాలూకాలోని ఘంటంవారిపల్లి గ్రామ పంచాయతీ ఆవరణలో మంగళవారం బాలల గ్రామసభ జరిగింది. అధ్యక్షుడు హెచ్ఎస్ నవీన్ నేతృత్వంలో ఏర్పాటైన సమావేశంలో వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు తమ స్కూళ్లలోని సమస్యలను వివరించారు. పంచాయతీ పరిధిలోని 9 ప్రాథమిక, 3 ప్రాథమికోన్నత, ఒక హైస్కూల్ మొత్తం 13 పాఠశాలలనుంచి 200మందికి విద్యార్థులు పాల్గొన్నారు. పాఠశాల ప్రహరీగోడ, క్రీడామైదానం, తరగతి గదులు, వంట గది మరమ్మతులు చేయాలని, తాగునీటి వ్యవస్థ కల్పించాలని, పాఠశాలలకు రంగులు వేయాలని, పైకప్పు పంజీలే చేయాలని, పాఠశాలల సమీపంలో పేరుకున్న చెత్తదిబ్బలు, కంపచెట్లను తొలగించి పాముల బెడద తప్పించాలని ఇలా పలు అంశాలను ప్రస్తావించారు. ఇదే సందర్భంగా కొన్నిచోట్ల తాగుబోతుల బెడదను నియంత్రించాలని, ప్రభుత్వ స్థలాలను కాపాడేలా చర్యలు చేపట్టాలని కోరారు. సమస్యలపై విద్యాశాఖ ఉన్నతాధికారులతో చర్చించి పరిష్కరిస్తామని పంచాయతీ అధ్యక్షుడు నవీన్ తెలిపారు. సమావేశంలో పీడీఓ నారాయణస్వామి, సభ్యులు రవణమ్మ, మంజునాథ, వెంకటేశ్, శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయులు రామసుబ్బమ్మ, టీచర్ నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పంచాయతీ సభ్యులు తదితరులు

ఘనంగా కాళికా కమటేశ్వర స్వామి మండలపూజ

దొమ్మసంద్ర, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ఆనేకల్ తాలూకా సర్జాపుర హోబళి దొమ్మసంద్ర గ్రామంలోని కాళికా కమటేశ్వర స్వామికి 48వ రోజు మండల పూజా కార్యక్రమం ఘనంగా జరిగింది. విశ్వకర్మ సమాజ సేవా ట్రస్టు ఆధ్వర్యంలో కొనసాగా యి. స్వామికి క్షీరాభిషేకం, కుంకుమార్చన పుష్పాలంకరణ, వాద్య గోష్ఠి, హోమం, యాగం ఇతర ధార్మిక కార్యక్రమాలు జరిగాయి. దొమ్మ సంద్ర గ్రామ పంచా యతీ అధ్యక్షుడు నరేశ్, యొ జనా ప్రాధికార మాజీ అధ్య క్షుడు జయణ్ణ, సభ్యులు జయదేవ్, అంబు జ, దనరాజు, మాజీ సభ్యు లు దనలక్ష్మి, నారాయణ స్వామి తదితరులు పాల్గొన్నారు. మొత్త మ్మీద గ్రామంలో జాతర వాతా వరణం నెలకొని సందడిగా మారింది.



విశేష పుష్పాలంకరణ

ఆర్కిటెక్చర్ పట్ల ఆదరణ పెరుగుతోంది



వివిధ విభాగాల విజేత విద్యార్థులు

బెంగళూరు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): నగర ప్రాంతాలలో ఆర్కిటెక్చర్ పట్ల ఆదరణ పెరుగుతుండగా కోర్సులు చేసిన వారు నిర్మాణరంగం తోపాటు నివాసాల ఏర్పాటు చేసుకునేవారికి కొత్త ఆలోచనలు కలిగించాలని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆర్కిటెక్చర్ కర్ణాటక చాప్టర్ అధ్యక్షుడు ఆర్ మోహన్ పిలుపునిచ్చారు. లాటిట్యూడ్ 2025 పేరిట అంతర్జాతీయస్థాయి ప్రదర్శనలు, చర్చాగోష్ఠి నగరంలో జరిగాయి. దేశంలోని వాస్తు శిల్పులతోపాటు అంతర్జాతీయ గుర్తింపు పొందిన ఆర్కిటెక్టర్‌లు భాగస్వాములయ్యారు. ఈ సందర్భంగా మోహన్ మాట్లాడుతూ దేశంలోని ప్రముఖ నగరాలలో డిజైన్ల రూపంలో నిర్మించే భవనాలు పెరుగుతున్నాయన్నారు. అందుకు పలు కారణాలు ఉన్నాయన్నారు. సాధారణ భవనం అంతగా ఆకట్టుకోదనేది ఒక కారణమైతే, ఇంటీరియర్‌లో వారికి అవసరమైన రీతిలో డిజైన్లు చేయించుకుంటున్నారన్నారు. నగరాలలో రద్దీ పెరుగుతోందని అందుకు అనుగుణంగా ఫ్లై ఓవర్లు, అండర్‌పాస్‌లు, అండర్‌గ్రౌండ్ వంటి నిర్మాణాలలో డిజైన్లు కీలకమన్నారు. నగరాలు, పట్టణాలలో మౌలిక సదుపాయాలు సమకూర్చడంతోపాటు ఆధునిక డిజైన్లను ఆర్కిటెక్టర్లు రూపొందించాలన్నారు. వివిధ ఆర్కిటెక్చర్ కళాశాలలనుంచి వచ్చిన విద్యార్థులు ప్రదర్శించిన మోడల్స్‌కు బహుమతులు ప్రదానం చేశారు. పాట్రిక్ బిల్డింగ్స్ బిట్వీన్ స్పేస్ విభాగంలో దివ్య యతిరాజన్, వ్యక్తిగత నివాసాల విభాగంలో ఆనంద్ ఆర్ కురుడి విజేతలుగా నిలిచారు. ఆర్కిటెక్ టెక్నికల్ సర్వీసెస్ విభాగం హెడ్ జయశంకర్ రెంటింకార్, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆర్కిటెక్చర్ వైస్ చైర్మన్ మోహన్ హరిసోత్‌తోపాటు రఘునందన్ గురురాజ్‌లు పాల్గొన్నారు. రాష్ట్రంలోని అన్ని ఆర్కిటెక్చర్ కళాశాల విద్యార్థుల ఆలోచనలు పంచుకునేందుకు వేదికగా సదస్సు జరిగిందని పలువురు అభిప్రాయపడ్డారు.

మళ్లూరులో వైద్య శిబిరం

శిడ్లఘట్ట, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): తాలూకాలోని మళ్లూరు గ్రామ గౌరమ్మ మలికెట్టి ఆరోగ్య కేంద్రంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. మధుమేహం, రక్తపోటు, నేత్ర పరీక్షలు చేసి అవసరమైనవారికి మందులు పంపిణీ చేశారు. బెంగళూరు సమత్వం 'సేవాసంస్థ, ఫువ్వాడ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శిబిరం జరిగింది. సమత్వం 'సేవాసంస్థ ముఖ్యుడు డాక్టర్ సత్యనారాయణ శ్రీకంఠ మాట్లాడుతూ ఇటీవలికాలంలో నగర ప్రాంతాలలో ప్రతి వందమందిలో 20మంది, గ్రామీణ ప్రాంతాలలో పదిమందికి బీపీ, షుగర్ సమస్యతో బాధపడుతున్నారన్నారు. గ్రామాలలోనూ గుర్తిస్తే చికిత్స సులభతరం అవుతుందన్నారు. జీవనశైలిలో కొన్ని మార్పులు చేసుకోవడంతోపాటు యోగా, స్వల్ప వ్యాయామాలతో మెరుగైన ఆరోగ్యం సాధ్యమన్నారు. 200మందికిపైగా శిబిరం ప్రయోజనం పొందారు. శిబిరార్థులకు పౌష్టిక పానీయం, భోజన వ్యవస్థ కల్పించారు. సమత్వం సేవా సంస్థ డాక్టర్ చైత్ర, ఫువ్వాడ ఫౌండేషన్‌కు చెందిన డాక్టర్ ఫువ్వాడ సందీప్, డాక్టర్ ప్రియాంక, ఎంటీ వీరకుమార్, స్వయం సేవకులు పుట్టప్ప, మనోజ్, మంజునాథ్, ప్రవీణ్, వినయ్, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.



శిబిరంలో వైద్య పరీక్షలు

హత్యకేసు నిందితులపై పోలీసుల ఫైరింగ్



నిందితులు వీరే..

బెంగళూరు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): హుబ్బళ్ళి నగరం విద్యానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో గార్డెన్ హైబెర్ పార్కింగ్ స్థలం విషయంలో ఓ యువకుడిని హత్యచేసిన ముగ్గురు నిందితులపై పోలీసులు మంగళవారం ఫైరింగ్ చేశారు. ఇంద్రప్రస్థనగర్‌కు చెందిన ఆకాశ్ వాల్మీకి (22)ను హత్య చేశారు. నిందితులను అరెస్టు చేసేందుకు వెళ్లిన సమయంలో పోలీసులపై తిరగబడ్డంతో కాల్పులు చేశారు. ఆనంద్‌నగర్‌కు చెందిన అభిషేక్ శిరూర్, వినోద్ అంబిగెర, ఎల్లప్ప కోటిలు పారిపోయేందుకు పరుగులు తీసేందుకు ప్రయత్నించారు. దీంతో పోలీసులు నిందితులపై ఫైరింగ్ జరిపి అదుపులోకి తీసుకున్నారు. ముగ్గురిని హుబ్బళ్ళిలోని కిమ్స్ ఆసుపత్రికి తరలించి చికిత్సలు అందిస్తున్నట్లు నగర పోలీస్ కమిషనర్ శశికుమార్ తెలిపారు. ఆసుపత్రిలో ముగ్గురిని పరామర్శించిన తర్వాత కమిషనర్ మీడియాతో మాట్లాడుతూ చిన్న విషయానికే సోమవారం రాత్రి జరిగిన ఘటనలో రౌడీయిజం చేసి హత్య చేశారన్నారు. మంగళవారం తెల్లవారు జామున నిందితులకోసం వెళ్లగా తప్పించుకునే ప్రయత్నం చేయగా కాల్పులు చేశామన్నారు. హత్యకు గురైన ఆకాశ్‌పై ఒక కేసు నమోదు కాగా వీరిపై కేసులు ఉన్నాయని గ్రూపులుగా మారి తరచూ గొడవలు చేసుకునే వారన్నారు. చివరకు నిందితులు పట్టుబడ్డారని తెలిపారు.



కనీస వేతనం ఇవ్వండి

కనీస వేతనాలు అమలు చేయాలని కోరుతూ అంగన్‌వాడీ కార్యకర్తలు డిమాండ్ చేశారు. నగరంలోఫ్రీడం పార్కులో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలనుంచి వచ్చిన కార్యకర్తలు నిరసనలో పాల్గొన్నారు. ఐసీడీఎస్ పథకం ప్రారంభమై 50ఏళ్లు పూర్తైన సందర్భంగా కనీసవేతనం అమలు చేయాలని అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులు కోరారు.

- ఆంధ్రజ్యోతి, బెంగళూరు

కనుల పండువగా సీతారామకల్యాణం

బెంగళూరు, జనవరి 28(ఆంధ్రజ్యోతి): విల్సన్‌గార్డెన్ వాసవి కన్వెన్షన్ సెంటర్‌లో ఉయ్ వైశ్య సంస్థ ఆధ్వర్యంలో సీతారామ కల్యాణం, వాసవిమాత ఊయలసేవ మంగళవారం కనులపండువగా జరిగింది. ఎమ్మెల్యే ఉదయ్ గరుడాచార్ ముఖ్యఅతిథిగా పాల్గొనగా ఉయ్ వైశ్య ఫౌండర్ అనిల్‌గుప్త, అధ్యక్షులు సువర్ణతోపాటు పలువురి పర్యవేక్షణలో వేడుకలు జరిగాయి. శ్రీరాముడిని ఆదర్శదైవంగా భావించడంతోపాటు పితృవాక్యపాలకుడిగాను ఆదర్శతుడిగా నిలిచారు. సీతారామ కల్యాణం తోపాటు వాసవిమాత ఊంజల్‌సేవా కార్యక్రమాలు కొన సాగాయి. 3వేలమందికిపైగా భక్తులు పాల్గొన్నారు.



కల్యాణోత్సవంలో పాల్గొన్న నిర్వాహకులు, భక్తులు

కేఆర్ఎస్‌లో సీప్లేన్ ప్రాజెక్టుకోసం కేంద్రమంత్రుల చర్చలు

బెంగళూరు, జనవరి 28(ఆంధ్రజ్యోతి): మండ్య జిల్లా కేఆర్ఎస్ జలాశయంలో సీప్లేన్ ప్రాజెక్టు ప్రారంభించాలని కేంద్ర భారీ పరిశ్రమలశాఖ మంత్రి కుమారస్వామి కోరారు. కేంద్ర పౌర విమాన యానశాఖ మంత్రి రామ్మోహననాయుడుతో ఢిల్లీలో చర్చలు జరిపారు. కర్ణాటకలో మౌలిక సదుపాయాలు, పర్యాటక రంగ అభివృద్ధి విషయమై కుమారస్వామి పలు అంశాలను ప్రస్తావించారు. సీప్లేన్ సేవలు కర్ణాటకకు అవసరమని తెలిపారు. మైసూరు, మండ్య, బైందూరు, ఆల్మట్టి, బేళూరు, హళేబీడు, హంపి పర్యాటక కేంద్రాలకు అనుబంధంగా సీ ప్లేన్ ప్రారంభించాలని కోరారు. ఇదే సందర్భంలోనే హాసన్ విమానాశ్రయాన్ని త్వరితగతిన పూర్తి చేసేలా చొరవ చూపాలని కోరారు.

ఒక విశ్వం - ఒక కుటుంబం ట్రోఫీ ఆవిష్కరణ

బెంగళూరు, జనవరి 28(ఆంధ్రజ్యోతి): ఒక విశ్వం - ఒక కుటుంబం పేరిట ప్రత్యేక క్రికెట్‌ట్రోఫీని నిర్వహించడం సంతోషకరమని మాజీ క్రికెటర్ జీఆర్ విశ్వనాథ్ తెలిపారు. ఆధ్యాత్మికగురు మధుసూదనసాయితో కలసి ట్రోఫీని లాంచనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మధుసూదనసాయి మాట్లాడుతూ ఫిబ్రవరి 8 నుంచి చిక్కబళ్ళాపుర ముద్దేనహళ్ళిలోని సత్యకృష్ణన్ స్టేడియంలో జాతీయ, అంతర్జాతీయ క్రికెటర్లు టోర్నీలో పాల్గొంటారన్నారు. భారత్, శ్రీలంకకు చెందిన మాజీ క్రికెటర్లు మైదానంలో కనిపిస్తారన్నారు. సమాజశ్రేయస్సులో భాగంగా టోర్నీని నిర్వహిస్తున్నామన్నారు. ఇండియన్ క్రికెటర్లు ఇర్ఫాన్ పఠాన్, యూసుఫ్ పఠాన్, వెంకటేశ్‌ప్రసాద్, శ్రీలంక క్రికెటర్లు అజంతా మెండిస్, చమిందావాస్‌లు పాల్గొంటారన్నారు.

రైతు సమస్యల పరిష్కారానికి కృషి



శివారెడ్డి

చేళూరు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): తాలూకాలోని రైతుల సమస్యల పరిష్కారానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని తాలూకా కృషి సమాజ సమాఖ్య అధ్యక్షుడు వి శివారెడ్డి తెలిపారు. సంఘానికి నూతన అధ్యక్షుడిగా ఏకగ్రీవమైన అనంతరం ఆయన సభ్యులతో కలసి మీడియాతో మాట్లాడారు. రైతులకోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు అర్హులందరికీ చేరేలా పాటుపడతానన్నారు. రాయితీ ధరలలో విత్తనాలు, సాగు పరికరాలు ఇతర రైతా సౌలభ్యాలు అందేలా చూస్తామన్నారు. ఈ సందర్భంగా సభ్యులు జయరామిరెడ్డి, మాకిరెడ్డి, చలపతి, వెంకటరెడ్డి తదితరులు ఉన్నారు.

నారాయణ ఆసుపత్రుల బీమా పథకం

బెంగళూరు, జనవరి 28(ఆంధ్రజ్యోతి): నారాయణ వన్‌హెల్త్, నారాయణ హెల్త్ ఇన్సూరెన్స్ సంస్థలు సంయుక్తంగా ఆరోగ్యబీమారంగంలోకి ప్రవేశించాయి. ఆదిత్య హెల్త్‌ప్లాన్‌ను మంగళవారం విడుదల చేశారు. బీమా పథకం ద్వారా కోటి రూపాయల దాకా ఆసుపత్రి సేవలు, ఓపీడీ ప్రయోజనాలు సాధ్యమవుతాయని ఇన్సూరెన్స్ పాలకవర్గం డైరెక్టర్ రవి విశ్వనాథ్ తెలిపారు. ఉత్తమ ఆరోగ్యం మా ఆశయమని, వ్యక్తిగత ఆరోగ్యసేవలు కల్పించడంతోపాటు ఫ్యామిలీ డాక్టర్, కేర్ మేనేజర్ సేవలు వర్తిస్తాయన్నారు. రూ.25లక్షలనుంచి కోటి రూపాయలదాకా ప్లాన్‌లు ఉన్నాయన్నారు. జనరల్ ఫిజిషియన్, పీడియాట్రిక్, గైనకాలజీ సేవలు వర్తిస్తాయని, నిపుణుల పరీక్షలు, మందుల కొనుగోళ్లకు వర్తిస్తాయన్నారు. పాలసీ అమలులోకి వచ్చిన వెంటనే వైద్యం పొందేందుకు అర్హులవుతారన్నారు.

ఓం నవ నరసింహ భక్తిగీతాలు విడుదల

బెంగళూరు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): 'ఓం నవ నరసింహ' పేరిట ఇంగ్లీష్ భక్తిగీతాలను మంగళవారం లాంచనంగా విడుదల చేశారు. దర్శన్ నారాయణ్ నేపథ్య గాయకుడు కాగా స్వస్తిక్ కారెకర్ సంగీతాన్ని సమకూర్చారు. శ్రేయస్ సాహిత్యం అందించారు. నాట్యం అకాడమీ ఆఫ్ పెర్ఫార్మింగ్ ఆర్ట్ విద్యార్థులు భక్తిగేయాలకు అనుగుణంగా నృత్యం చేశారు. భక్తిగీతాలు ప్రత్యేక ఆకర్షణగా ఉన్నాయని ప్రముఖ నిర్మాత కృష్ణప్రసాద్ తెలిపారు.

ఆరోగ్య జాతాను విజయవంతం చేయాలి

● జెడ్పీ సీఈఓ రాహుల్ తుకారాం పాండ్యే



మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ రాహుల్ తుకారాం పాండ్యే

రాయచూరు జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వ్యాప్తంగా ఈ నెల 30వ తేదీ నుంచి ఫిబ్రవరి 13వ తేదీ వరకు చేపట్టే ఆరోగ్య అవగాహన జాతాను విజయవంతం చేయాలని జెడ్పీ సీఈఓ రాహుల్ తుకారాం పాండ్యే అధికారులకు సూచించారు. కుష్ఠ వ్యాధి నివారణకు సంబంధించి చేపట్టే కార్యక్రమం పై పకడ్బందీ ప్రణాళికను సిద్ధం చేసుకోవాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. అవగాహన జాతాకు సంబంధించి మంగళవారం ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కార్యాలయంలో రాష్ట్ర ఉన్నతాధికారుల నుంచి ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్స్ సమన్వయ సమావేశానికి జెడ్పీ సీఈఓ రాహుల్ తుకారాం పాండ్యే అధ్యక్షత వహించి మాట్లాడారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో వేర్వేరుగా ప్రచారం నిర్వహించి ప్రజల్లో స్పష్టమైన అవగాహన కల్పించేలా కార్యాచరణ సిద్ధం చేయాలన్నారు. ఆరోగ్య శాఖ అధికారులు అన్ని శాఖల అధికారులతో సంప్రదించి ఆయా శాఖల సమన్వయంతో కార్యక్రమాన్ని జిల్లాలో సమర్థంగా నిర్వహించాలన్నారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1618.09	1,588.55
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	0	0
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	11.099	354
నీటి నిల్వ (టీఎంసీలు)	56.13	9.86

పప్పు శనగ ఖరీదు కేంద్రాలు ప్రారంభం

బళ్లారి గాంధీనగర్, జనవరి 28(ఆంధ్రజ్యోతి): రబీ సీజన్‌లో పండించిన శెనగ పంటను మద్దతు ధర పథకం క్రింద బెంగళూరు రాష్ట్ర సహకార విక్రయ మండలి ఆధ్వర్యంలో బళ్ళారి నగరంలో శనగ మద్దతు ధర కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తున్నట్లు వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర ప్రతి క్వింటాల్‌కు రూ 5,650లు ప్రకారం రైతుల నుంచి కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. బళ్లారి నగరంలోని ఎస్పీ సర్కిల్ మారుతి నగర్‌లోని 2వ క్రాస్ సేవా సహకార సంఘం 9900559927, సిరుగుప్ప పట్టణంలోని పీఎల్‌డీ బ్యాంకు కట్టడంలోని పశు ఆసుపత్రి ప్రక్కన ఉన్న వ్యవసాయ పత్తిన సహకార సంఘం(9845166601) కేంద్రాల్లో కొనుగోలు చేస్తారన్నారు. ఇందుకోసం ఆధార్ కార్డు, ప్రస్తుతం ఏడాది పహిణీ, ఎఫ్ఐడీ, రైతులు తమ పేరుతో ఫ్రూట్స్ పోర్టల్‌లో పేరు నమోలదు చేయించి ఉండాలి, బ్యాంకు ఖాతా పుస్తకం ఫొటోస్టాట్ కాపీ అందజేయాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో ఎకరాకు 4 క్వింటాల నుంచి గరిష్ఠంగా 20 క్వింటాళ్ళ మాత్రమే శెనగ కొనుగోలు చేస్తారు. ఈ అవకాశం 90 రోజుల మాత్రం ఉంటుందన్నారు. రైతులు మధ్యవర్తులను ఆశ్రయించకుండా నేరుగా కొనుగోలు కేంద్రాలకు వెళ్ళి తమ ఉత్పత్తులను అమ్మకోవాలని సూచించారు.

విద్యుత్ చౌర్యం కేసులో రూ.18లక్షల జరిమానా

బళ్లారి గాంధీనగర్, జనవరి 28(ఆంధ్రజ్యోతి): విద్యుత్ చౌర్యానికి పాల్పడిన ప్రైవేట్ సంస్థకు కోర్టు రూ.18 లక్షల జరిమానా విధించింది. బళ్ళారి తాలూకా పరిధిలోని ఏళుబెంచి గ్రామానికి చెందిన పూర్ణిమా ఎంటర్ ప్రైజస్ యజమాని అమరేశ్వర శాస్త్రి ఆధ్వర్యంలో నడుస్తున్న ఆర్‌ఓ ప్లాంటుకు అక్రమంగా విద్యుత్ ఉపయోగి స్తున్నారు. విద్యుత్ మీటర్ నుంచి బైపాస్ ఏర్పాటు చేసుకుని అక్రమంగా తన ఇండస్ట్రీలోని విద్యుత్ పరికరాలకు విద్యుత్‌ను ఉపయోగించుకుంటున్నట్లు జెస్కాం అధికారుల దాడుల్లో బయట పడింది. చౌర్యానికి పాల్పడిన కేసుకు సంబంధించి జిల్లా అడిషనల్ సెషన్స్ కోర్టు న్యాయమూర్తి విద్యాధర శిరహట్టి నిందితుడికి రూ 18,02,951 రూపాయలు జరిమానా విధిస్తూ మంగళవారం తీర్పునిచ్చారు. జరిమానా చెల్లించని పక్షంలో మూడు నెలల జైలు శిక్ష విధిస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఈ కేసుకు సంబంధించి 2022, ఆగస్టు 18వ తేదీన ఉదయం 10.39గంటల సమయంలో జెస్కాం విజిలెన్స్ అధికారి అసిస్టెంట్ ఇంజనీరు కె. గాదిలింగప్ప తన సిబ్బందితో దాడులు నిర్వహించారు. ఈ మేరకు ఆయనపై అప్పట్లో జెస్కాం అధికారులు కేసు నమోదు చేశారు. జెస్కాం బళ్లారి విభాగం, జెస్కాం జాగృత దళ విభాగం అధికారి పోలీసు ఇన్‌స్పెక్టర్ ఆర్.గాయిత్రి కోర్టుకు అందజేసిన చార్జ్‌షీట్ ఆధారంగా సాక్షాధారాలను విచారించిన కోర్టు తీర్పునిచ్చింది. ప్రభుత్వం తరుపున న్యాయవాది శేఖరప్ప వాదించారు.

పోలీసుల అదుపులో కిడ్నాపర్లు ..!

● అనుమానితుల్లో ఐదుగురు ● వివాదంలో ఓ రాజకీయ నేత పాత్ర ● అధికారికంగా ప్రకటించని పోలీసులు

బళ్లారి, జనవరి 28(ఆంధ్రజ్యోతి): నగరంలో కలకం రేపిన వైద్యుడు డాక్టర్ సునీల్ కుమార్ కిడ్నాప్ కేసులో పోలీసలు ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిసింది. ఇందులో ఓ రాజకీయ నాయకుడి కుమారుడితో పాటు వైద్యుడు సునీల్ కుమార్‌కు అత్యంత సన్నిహితంగా ఉండే ఓ వ్యక్తి కూడా పోలీసుల అదుపులో ఉన్నారని విశ్వసనీయ వర్గాల సమాచారం. వీరితో పాటు ఓ కార్పొరేటర్ కుమారుడి కోసం పోలీసులు అన్వేషిస్తున్నారని తెలిసింది. డాక్టర్ సునీల్ కుమార్ శనివారం ఉదయం ఇంటి సమీపంలోని ఎస్ఎన్ పేట వద్ద మార్నింగ్ వాక్ చేస్తున్న సమయంలో గుర్తుతెలియని కొందరు కారులో వచ్చి బలవంతంగా కిడ్నాప్ చేశారు. అతన్ని కారులో ఎక్కించుకుని తలకు మంకీ క్యాప్ వేసి ఎక్కడికి తీసుకెల్లాలో తెలియకుండా కిడ్నాప్ చేశారు. ఈ విషయం తన సోదరుడు వేణుగోపాల్ శెట్టి ఆదేరోజు గాంధీనగర్ పోలీస్టేస్‌లో ఫిర్యాదు చేశారు. కిడ్నాపర్లు డాక్టర్ ను వదలాలంటే రూ. 6 కోట్లు డబ్బులు డిమాండ్ చేశారు. అయితే ఎస్పీ శోభారాణి నేతృత్వంలో 4 పోలీస్ బృందాలను ఏర్పాటు చేసింది. అలాగే కిడ్నాపర్లు ఊరు దాటివెల్లకుండా ఉండేందుకు అన్ని చెక్‌పోస్టుల్లో అలర్టు చేసింది. ఇక ఎటువెల్లాలో తెలియని కిడ్నాపర్లు అదేరోజు సాయంత్ర 9గంటలకు డాక్టర్‌ను వదిలేశారు. అంతే కాకుండా కిడ్నాపర్లు డాక్టర్‌కే రూ. 300 చార్జీకి ఇచ్చి పంపించడం మరో విషయం. కీలక సమాచారంతో మంగళవారం



మరో నలుగురిని అదుపులోకి తీసుకున్నారని తెలిసింది. ఇది ఇలా ఉంటే ఎస్పీ శోభారాణిని విచారిస్తే కేసు విచారణ కొనసాగుతోందని, కిడ్నాపర్స్‌ను త్వరలో అప్పగిస్తామన్నారు. మొత్తం మీద డాక్టర్ కిడ్నాప్ కేసు ఎటు వైపు మలుపు తిరుగుతుందో ఇందులో పాత్రదారులు, సూత్రదారులు ఎవరు అనేది ఎవరు పోలీసుల వద్ద ఇంకా ఏ ఏ పేర్లు ఉన్నాయి. ఎవరిని అదుపులోకి తీసుకున్నారో అనేది సర్వత్రా ఆసక్తిగా మారింది.

మహిళలు ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం వహించరాదు

● వీఎస్కేయూ వైస్ చాన్స్‌లర్ మునిరాజు



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న వీఎస్కేయూ వీసీ మునిరాజ్

బళ్లారి గాంధీనగర్, జనవరి 28(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత రోజుల్లో పిల్లలు పౌష్టిక ఆహారం కొరత, తల్లిపాలు కొరత కారణంగా చిన్నతనంలోనే పలు ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారని, కుటుంబ సభ్యులు బాధ్యతతో పాటు మహిళల తమ ఆరోగ్యం పట్ల దృష్టి సారించాల్సిన అవసరం ఉందని వీఎస్కేయూ వీసీ మునిరాజ్ సూచించారు. మంగళవారం స్థానిక శ్రీ కృష్ణదేవరాయల విశ్వవిద్యాలయం అంబేద్కర్ సభాంగణంలో బళ్లారి ఐఎంఏ, డబ్లూడీడబ్లూ, గైనకాలజీ సొసైటీ, ఫ్యామిలీ ప్లానింగ్ అసోసియేషన్, విశ్వవిద్యాలయ సమాజకార్య అధ్యయన విభాగం సంయుక్తంగా ఏర్పాటు చేసిన సర్వైకల్ క్యాన్సర్, హెచ్‌పీవీ టీకా జాగృతి కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆడపిల్లల ఆరోగ్య విషయంలో సమాజంలో మనల్ని ఎన్నో మూఢనమ్మకాలు పట్టిపీడిస్తున్నాయని, ఆడపిల్ల జన్మిస్తేనే భారమనుకునే భావన తల్లితండ్రుల్లో దూరం కావాలన్నారు. అనంతరం ఫ్యామిలీ ప్లానింగ్ ఇండియా అధ్యక్షులు టీజీ విఠల్ మాట్లాడుతూ రోగాల గురించి పరిశోధనలు జరుగుతున్నా, ఆదే స్థాయిలో రోగాల సంఖ్య పెరుగుతున్నాయన్నారు. బళ్లారి ఐఎంఏ కార్యదర్శి డాక్టర్ సంగీతా కట్టిమని మహిళల్లో గర్భకోశ క్యాన్సర్ గురించి వివరించారు. ఓబీజీ గైనాకాలజీ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ శివకుమార్ ప్రత్యేక ఉపన్యాసం ఇచ్చారు. కార్యక్రమంలో పాల్గొన్న మహిళలకు స్క్రీనింగ్, హెచ్‌పీవీ టీకాలు వేశారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయం మహిళా సిబ్బందితో పాటు వందమందికి పైగా విద్యార్థులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఆధ్వర్యంలో 'దూరదృష్టి' కార్యక్రమం



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అన్నపూర్ణ తుకారామ్

తోరణగల్లు, జనవరి 28(ఆంధ్ర జ్యోతి): తాలుకా కార్యాలయంలో బళ్లారి స్కడ్ వేస్, జేఎస్‌డబ్ల్యూ ఫౌండేషన్ ఆధ్వర్యంలో తాలుకాలో మంగళవారం 'దూరదృష్టి' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అన్నపూర్ణ తుకారామ్ కార్యక్రమంలో మాట్లాడుతూ సండూరు తాలుకా ప్రముఖంగా మైన్స్ మీద ఆధారపడి వుంది. కానీ ఇది శాశ్వతంకాదు అందువలన రాబోయే కాలంలో ముందు జాగ్రత్త కొరకు ఇప్పటి నుంచే తగిన దూరదృష్టితో తగిన అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలన్నారు. తహసీల్దార్ అనిల్ కుమార్ ముఖ్య అధికారులు షడక్షరయ్య, జిందాల్ అధికారులు ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

రేపు సామూహిక వివాహాలు

సిరుగుప్ప, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : అంకలి మఠంలో ఈ నెల 30వ తేదీన బసవరాజు మహాస్వాముల ఆధ్వర్యంలో ఉచిత సామూహిక వివాహాలు జరుగుతున్నట్లు అంకలి మఠం అధ్యక్షుడు వై శ్రీనివాస తెలిపారు. ప్రతి యేడాది మాదిరిగానే ఈ యేడాది ఉచిత సామూహిక వివాహాలతో పాటు స్వాముల వారికి తులాభార అభిషేకం, తులాభార సేవలు, పురణ పఠనం నిర్వహిస్తామన్నారు. ప్రజలు పాల్గొని తాత ఆశీర్వాదం పొందాలని కోరారు.

దుమ్ముధూళి మధ్యే దుకాణాలు

కంప్లి, జనవరి 28(ఆంధ్రజ్యోతి): నిత్యం అధికంగా ప్రజలు తిరిగాడే మార్కెట్ దుకాణాలు దుమ్ముధూళి మధ్యే కొనసాగుతున్నాయి. తాలుకాలో నడిబొడ్డున ఉన్న మార్కెట్‌లో రోడ్లు, మౌలిక సదుపాయాలు లేక వినియోగదారులు ఇబ్బంది పడుతున్నారు. ప్రతి రోజు తోటల నుంచి తాజాగా తెచ్చిన కాయగూరలు ఇక్కడ దుమ్ము పడిపోతన్నాయి. దీంతో ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారు. ఇప్పటికైనా పురసభ అధికారులు పెద్దపెద్ద వాహనాలు మెయిన్ రోడ్లపై రాకుండా ఇతర మార్గాల గుండా వెళ్లేలా చూడాలని స్థానికులు కోరుతున్నారు.



రోడ్డు పక్కన దుమ్మూధూళితో ఇబ్బంది పడుతున్న వ్యాపారులు



దుర్గమ్మ గుడి అండర్ బ్రిడ్జి

ప్రకటించారు.. ప్రారంభించలేదు..!

● దుర్గమ్మ గుడి వంతెన ప్రారంభోత్సవం మరోసారి వాయిదా

బళ్లారిరూరల్, జనవరి 28(ఆంధ్రజ్యోతి): నగరంలో దుర్గమ్మ గుడి అండర్ బ్రిడ్జి ప్రారంభత్సోవం మరోసారి వాయిదా పడింది. జనవరి 26న ఎమ్మెల్యే నారా భరత్ రెడ్డి ప్రారంభిస్తారని అధికారులు ప్రకటించారు. రహదారి కష్టాలు తీరనున్నాయని ప్రజలు చాలా ఆశగా ఎదురు చూశారు. పనులు పూర్తయినా వంతెన ప్రారంభించకపోవడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారని రాష్ట్ర మానవ హక్కుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ ఉరుకుందరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. నగరంలో ట్రాఫిక్ వ్యవస్థ ఎక్కువ కావడంతో దుర్గమ్మగుడి నుండి ఏపీఎంసీ కొత్త బస్టాండు తదితర ప్రాంతాలకు నగరాన్ని చుట్టేసుకుని వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయన అన్నారు.

అండర్ బ్రిడ్జి ప్రారంభించాలని సీపీఎం నిరసన



నిరసన తెలుపుతున్న భారత కమ్యూనిస్టు పార్టీ నాయకులు

నగరంలోని దుర్గమ్మగుడి సమీపంలోని రైల్వే అండర్ బ్రిడ్జిని ప్రారంభించి, వాహనాల రాకపోకలను అనుమతించాలని కోరుతూ భారత కమ్యూనిస్టు పార్టీ(మార్కిస్టు) తాలూకా కమిటీ మంగళవారం నిరసన చేపట్టింది. రోడ్డు నిర్మాణ పనులు పూర్తయ్యాయి..జనవరి 26న ట్రాఫిక్‌ను తెరుస్తామని నగర ఎమ్మెల్యే భరత్‌రెడ్డి ప్రకటించినా ప్రారంభించ లేదన్నారు. కాంట్రాక్టర్ ఇన్‌ఫ్రా ద్వారా నిర్మిత కేంద్రం రూ. 1కోటి 89లక్షల అంచనా వ్యయంతో అభివృద్ధి చేసింది. ఇది కాంక్రీట్ రోడ్డు ఇరువైపుల పుట్‌పాత్ నిర్మించారు. లైటింగ్ వ్యవస్థ పూర్తి కాలేదు. ట్రాఫిక్ కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని, ఇప్పటికైనా అధికారులు దీనిపై చర్యలు తీసుకోవాలన్నారు. చంద్రకుమారి, యర్రిస్వామి. సత్యబాబు, హనుమంత, తిప్పేరుద్ర, నవీన్ పాల్గొన్నారు.

దొంగ పోలీసులు..!

బళ్లారి గాంధీనగర్, జనవరి 28(ఆంధ్రజ్యోతి): దోపిడీకి కాదేది అనర్హం అన్న చందానా... ఏకంగా పోలీసులమని వచ్చి రైతు నుంచి ఏకంగా రూ 30వేలు దోచుకెళ్ళిన ఘటన విజయనగర జిల్లాలో మంగళవారం చోటు చేసుకుంది. విజయనగర జిల్లా పరిధిలోని హూవినహడగలి తాలూకా మిరాకొరనహళ్ళి నాగతిబసాపుర మార్గ మధ్యలో సోమవారం పోలీసులమని చెప్పుకుంటూ మోటారు సైకిల్‌ను అడ్డగించి దోచుకోవడం చర్చనీయాంశంగా మారింది. మాన్యరమసలవాడ గ్రామానికి చెందిన రైతు గదుగిన రాజశేఖరప్ప ట్రాక్టర్ టైర్లు కొనడానికి హూవిన హడగలి పట్టణానికి వెళుతుండగా బైక్‌పై వచ్చిన ఇద్దరు వ్యక్తులు పోలీసుల మని బండిని ఆపారు. గంజాయి రవాణా చేస్తున్నట్లు సమాచారం అందిందని, మోటారు సైకిల్‌ను చెక్‌చేయాలని రైతును బెదిరించారు. మోటార్ సైకిల్లో బ్యాగును వెతికే నెపంతో బ్యాగులో ఉన్న రూ 30వేల నగదును దోచుకుని బైక్‌పై పరారయ్యారు. హూవిన హడగలి పోలీసు స్టేషన్‌లో రైతు రాజశేఖరప్ప ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

సర్వర్ సమస్యతో రైతులకు కష్టాలు



హనుమసాగర్ ఏపీఎంసీలో పేర్ల నమోదు కోసం వేచియున్న రైతులు

గంగావతి రూరల్, జనవరి 28(ఆంధ్రజ్యోతి): కొప్పళ జిల్లా వ్యాప్తంగా మద్దతు ధర పథకం క్రింద కంది కొనుగోలు కేంద్రాలు ప్రారంభమైనా, పేర్లు నమోదు చేసుకోవడానికి సర్వర్ సమస్య రైతులను వేధిస్తోంది. సాంకేతిక సమస్య కారణంగా రైతులు గంటల తరబడి నమోదు కేంద్రాల్లో వేచిచూడాల్సిన పరిస్థితి నెలకొంది. జనవరి 2వతేదీ నుంచి కొప్పళ జిల్లా వ్యాప్తంగా కంది కొనుగోలు కేంద్రాలు ప్రారంభించారు. అయితే కేంద్రాల్లో సర్వర్ సమస్య రైతులను పట్టిపీడిస్తోంది. జిల్లా పరిధిలోని కుష్టిగి తాలూకా, హనుమ సాగర్ రైతులు పేర్ల నమోదు కోసం వస్తున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆరేడు మంది పేర్లు మాత్రమే నమోదు కావడం పట్ల రైతులు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గతంలో రైతుల పేర్లు ఎఫ్ఐడీ(ఫార్మర్స్ ఐడెంటిటీ డిటైల్స్) పోర్టల్‌లో రైతులకు చెందిన సమాచారం నమోదు చేశారు. అయితే కేవైసీ నెపంతో మరోసారి రైతులు పూర్తిపేర్లు, ఆధార్, బ్యాంక్ పాస్ బుక్కు, పహణీ వివరాలు అప్‌లోడ్ చేయాల్సిన కారణంగా ఆలస్యం కావడంతో పాటు సాంకేతిక సమస్య రైతులకు మరో కంటకంగా మారింది. పనులు వదిలి గంటల తరబడి క్యూలో ఉండాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు సర్వర్ సమస్యను పరిష్కరించాలని రైతులు కోరుతున్నారు.

విద్యార్థులు వైజ్ఞానికంగా ఎదగాలి: ఎమ్మెల్యే

సిరుగుప్ప, జనవరి 28(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు వైజ్ఞానికంగా అవగాహన పెంచుకోవాలని ఎమ్మెల్యేబీఎం నాగరాజు పేర్కొన్నారు. సిరుగుప్ప పట్టణం ప్రభుత్వ బాలికల హైస్కూలులో మంగళవారం ఎమ్మెల్యే బీఎం నాగరాజు సైన్స్ ల్యాబ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు విజ్ఞానంలో ముందుస్థాయికి వెళితే భారత్ ఉన్నత స్థానానికి చేరుకుంటుందన్నారు. ఏఐ సాంకేతికపై అవగాహన కల్పించుకుని విద్యార్థులు మరింత రాణించాలన్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ విశ్వనాథ్, తాలుకా పంచాయతీ ఈఓ పవన్‌కుమార్, విద్యాశాఖ అధికారి గురప్ప, నగరసభ అధ్యక్షురాలు రేణుకమ్మ, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సండూరు ఓటమికి శ్రీరాములు కారణం కాదు

● ద్రవిడనాడు వానరసైన్యం అధ్యక్షుడు నారాయణ స్వామి



విలేకరులతో మాట్లాడుతున్న నారాయణ స్వామి

బళ్లారిరూరల్, జనవరి 28(ఆంధ్రజ్యోతి): సండూరు ఉప ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి ఓటమికి శ్రీరాములు బాధ్యులు కాదని ద్రవిడనాడు శ్రీరాములు వానర సైన్యం అధ్యక్షుడు నారాయణస్వామి అన్నారు. మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. శ్రీరాములు ఒక స్టేట్ లీడర్ అని, బీజేపీని ఎంతగానో బలోపేతం చేశారన్నారు. బళ్లారి, విజయనగరం, రాయచూరు, కొప్పళ, చిత్రదుర్గతో పాటు పలు జిల్లాలతో పాటు రాష్ట్రస్థాయి వరకు బీజేపీలో నాయకుడయ్యాడన్నారు. శ్రీరాములుకు రాష్ట్రంలో మంచి నాయకత్వాన్ని అందించే ఒక ఉన్నత స్థాయి పోస్టునివ్వాలని అన్నారు.

హోసూరు జోన్

శూలగిరి యూనియన్‌లో కలెక్టర్ పర్యటన



రోడ్డు పనులు పరిశీలిస్తున్న కలెక్టర్ సరయూ

హోసూరు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): కృష్ణగిరి జిల్లా శూలగిరి పంచాయతీ యూనియన్ కురుబరపల్లి, కోనేరుపల్లి, అత్తిముగం, బేరికై, బుక్కసాగరం పంచాయతీలలో రూ.4.1 కోట్లతో ప్రాథమిక పాఠశాలల్లో మౌలిక సదుపాయలు చేపట్టారు. కలెక్టర్ కెఎన్ సరయు మంగళవారం స్వయంగా పరిశీలించారు. 4.11లక్షలతో రెండు తరగతి గదులు చేపట్టారు. 'కరుణానిధి కలల ఇళ్ల పథకం' కింద రూ.3.50 లక్షలను తిమ్మరాయన్, లక్ష్మిలకు మంజూరు చేయగా ఇంటి పనులు పరిశీలించారు. నిధులు సక్రమంగా అందుతున్నాయా లేదా అని లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. గడువులోగా నిర్మాణాలను పూర్తి చేయాలని ఇంజనీర్లకు ఆదేశించారు. 15వ ఆర్థిక సంఘం మంజూరు పథకం కింద బుక్కసాగరం గ్రామంలలో రూ.2.47 లక్షలతో సమీకృత బాలల భవనంలో చిన్నారులకు, అంగన్‌వాడీ కేంద్రంలో ఆహారాన్ని పరీక్షించారు. అత్తిముగం పంచాయతీలోని ఆది ద్రావిడ కాలనీలో 13ఇళ్లకు మరమ్మతు పనులు సాగుతున్నాయి. బేరికై పంచాయతీలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద వర్షపు నీటిని సేకరించేందుకు నూతనంగా ఇంకుడు గుంతలను పరిశీలించారు. నాబర్డు పథకం కింద రూ.44లక్షలతో లక్ష లీటర్ల సామర్థ్యంగల ఓవర్‌హెడ్ ట్యాంకు నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం బేరికైలో 1.78కోట్లతో 2.36 కిలోమీటర్ల మేర నిర్మిస్తున్న రోడ్డు పనుల తీరును గమనించారు. కాటినాయకనహళ్ళిలో ముఖ్యమంత్రి గ్రామ అభివృద్ధి పథకం కింద బేరికై రోడ్డు నుంచి కర్ణాటక రాష్ట్ర సరిహద్దు వరకు రహదారిని అభివృద్ధి చేస్తున్నారు. తిమ్మసంద్రం నుంచి బేరికై రోడ్డులో రెండు కిలోమీటర్ల రోడ్ల నాణ్యతను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా అభివృద్ధి అధికారి శాంతలక్ష్మి, యూనియన్ ఇంజనీర్లు గోవిందరాజ్, సత్యనారాయణరావు, అధికారులు సుందరమూర్తి, శివశంకరి, సూపర్‌వైజర్‌లు తదితరులు ఉన్నారు.

పూల ఎగుమతికి మెరుగైన వ్యవస్థ

హోసూరు, జనవరి 28(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ పూల వేలం కేంద్రంలో లక్షలాది రూపాయల టర్నోవర్ జరుగుతోందని వ్యవసాయ వాణిజ్యశాఖ డిప్యూటీ డైరెక్టర్ మోహన్ మంగళవారం తెలిపారు. గతంతో పోలిస్తే కృష్ణగిరి జిల్లాలో పూలసాగుకు అనువైన కేంద్రంగా ఉన్నా చాలామంది తమ తోటల్లోనే టోకుగా విక్రయించగా మిగిలిన పూలను బెంగళూరు మార్కెట్‌కు తరలించేవారన్నారు. 2022లో 7.76 ఎకరాల విస్తీర్ణంలో అంతర్జాతీయ పూల వేలం కేంద్రాన్ని ఏర్పాటు చేసిన సంగతి విదితమే. అనంతరం కోయంబత్తూరులోనూ ఆధునాతన వ్యవస్థ ఏర్పాటు చేశారు. గతంలో కంటే పూల ఎగుమతికి హోసూరులోనే ఆధునాతన వ్యవస్థ ఉందని పూల రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు.



అంతర్జాతీయ పూల వేలం కేంద్రం



కేరమ్స్ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వై. ప్రకాశం, మేయర్ సత్య

హోసూరు, జనవరి 28(ఆంధ్రజ్యోతి): హోసూరు నగరంలో పాఠశాల విద్యాశాఖ తరపున రాష్ట్రస్థాయి క్రీడా పోటీలను ఎమ్మెల్యే వై ప్రకాశ్, మేయర్ సత్య మంగళవారం ప్రారంభించారు. హోసూరులో భారతీయార్ జయంతి, గణతంత్ర దినోత్సవం సందర్భంగా పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో కేఏపీ కల్యాణమండపంలో క్యారమ్స్ టోర్నీ నిర్వహించారు. రాష్ట్రంలోని 38 జిల్లాలనుంచి ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలనుంచి 2600మంది విద్యార్థులు పాల్గొన్నారు. పోటీలు నాలుగురోజులపాటు కొనసాగనున్నాయి. జిల్లా విద్యాశాఖాధికారి ఇన్‌చార్జ్ మునిరాజ్‌తోపాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్య, వైద్య రంగాల అభివృద్ధికి సహకరించాలని వినతి

రాయచూరు జనవరి 28(ఆంధ్రజ్యోతి): కల్యాణ కర్ణాటక ప్రాంతానికి చెందిన ఏడు జిల్లాల్లో విద్య, వైద్య రంగాల అభివృద్ధి కోసం ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలని ప్రజా అభ్యుదయ సంఘాల నాయకులు కోరారు. ఈ విషయంలో ముఖ్యమంత్రిని కలిసి ప్రత్యేకంగా ఒత్తిడి తెచ్చేలా కృషి చేయాలంటు రాయచూరు లోకసభ సభ్యుడు జీ కుమార్ నాయక్‌ను కోరారు. మంగళవారం నగరంలోని ఎంపీ కార్యాలయంలో కలిసిన ప్రగతి, అభ్యుదయ, ప్రజా సంఘాల నాయకులు కల్యాణ కర్ణాటక ప్రాంతానికి చెందిన ఏడు జిల్లాల్లో విద్య, వైద్య రంగాల్లో ఎదురవుతున్న ఇబ్బందుల గురించి వివరించారు. 20 వేల ఉపాధ్యాయ ఖాళీలు ఉండగా బోధన లేక విద్యార్థులకు అవస్థలు ఎదురవుతున్నటు పరీక్షల ఫలితాల పై తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నట్లు తెలిపారు. అదే సమయంలో 35 లక్షల మందికి పైగా మహిళలు, బాలికలు రక్తహీనతతో బాదపడుతున్నారని ఆరోగ్య రంగాన్ని మరింత పటిష్టం చేసి పౌష్టిక హార నిర్మూలన కోసం కృషి చేయాలన్నారు. పౌష్టికాహార లోపాన్ని నివారించేందుకు ప్రత్యేక కార్యచరణ చేపట్టాలన్నారు. ప్రత్యేక బృందంగా రాష్ట్ర ప్రభుత్వాలకు వేర్వేరుగా వినతి పత్రాలు ఇచ్చేలా ఎంపీ చొరవ తీసుకోవాలని కోరారు.

చంద్రచూడేశ్వర హుండీ లెక్కింపు

హోసూరు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): హోసూరు నగరంలోని ప్రముఖ చంద్రచూడేశ్వర ఆలయంలో ఆలయ హుండీ ఆదాయాన్ని మంగళవారం లెక్కించారు. తిరువణ్ణామలై జోన్ జాయింట్ కమిషనర్ ఆదేశాల మేరకు కృష్ణగిరి అసిస్టెంట్ కమిషనర్ రామ్మూల్ నేతృత్వంలో హిందూ దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్లు పూరసన్, దేవరాజ్, ఈఓ సమీతురై, చినస్వామి, సత్య సమక్షంలో వందమందికి పైగా ఆదియమ్మాన్ కళాశాల విద్యార్థులు, నేషనల్ వెల్ఫేర్ సర్వీసెస్ విద్యార్థులు లెక్కించారు. రూ.26,82,122 నగదు, 7 గ్రాముల బంగారం, 183 గ్రాముల వెండి ఆదాయం వచ్చినట్టు తెలిపారు. పంజాబ్ ఇంటర్నేషనల్ బ్యాంకు ఖాతాలో జమ చేసినట్లు అధికారులు ప్రకటించారు.



హుండీ లెక్కిస్తున్న భక్తులు